RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 265 మేడ్చల్ మల్కాజ్‌గిరి 18 అక్టోబర్ 2024 శుక్రవారం పేజీలు : 4

## దేశంలో 5 కోట్ల పెండింగ్ కేసులు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఉన్న కోర్టుల్లో 5 కోట్లకుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాన్ని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఓ లిఖితపూర్వక సమాధానం ద్వారా లోక్‌సభకు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 1.18 కోట్ల కేసులు, సుప్రీంకోర్టులో 84,045 కేసులు, వివిధ హైకోర్టుల్లో 60,11,678 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. తగినన్ని మౌలిక వసతులు, తగినంత మంది సిబ్బంది లేకపోవడం కూడా ఇందుకు కారణాలని తెలిపారు. సంక్లిష్టమైన అంశాల కారణంగా మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. నిబంధనలను కచ్చితంగా అమలు పరచడం వల్ల కూడా ఇంకొన్ని పెండింగ్‌లో ఉంటున్నాయని తెలిపారు.




# మూసీ సుందరీకరణ కాదు...

# పునరుజ్జీవానికి నాంది!

## మూసీ ప్రాజెక్టుపై దుష్ప్రచారాలు మానుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక

హైదరాబాద్: తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవనమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మూసీనది అభివృద్ధి ప్రాజెక్టు వివరాలు వెల్లడించారు. "మూసీ దుర్గంధంలో మగ్గిపోతున్న వారికి మెరుగైన జీవితం ఇవ్వాలని ఈ ప్రాజెక్టు తలపెట్టాం. నగరం మధ్య గుండా నది వెళ్తున్న రాజధాని మరొకటి ఈ దేశంలో లేదు. దాదాపు 300 కి .మీ ప్రవహించే మూసీకి ఎంతో చరిత్ర, విశిష్టత ఉంది. మేం చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదు.. మూసీ నది పునరుజ్జీవం. కొందరు మెదడులో మూసీలో ఉన్న మురికికంటే ఎక్కువ విషం నింపుకొన్నారు. మెదడులో విషం నింపుకొని మూసీ ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారు.

**నిర్దయగా ఎవరినీ ఖాళీ చేయించలేదు :** మూసీ పరివాహక ప్రజలకు మంచి జీవితం ఇవ్వాలనేది ఈ ప్రభుత్వ ఆలోచన. మల్లన్న సాగర్, వేమలఘాట్‌లో ఏం జరిగిందో గుర్తు తెచ్చుకోవాలి. రాత్రికి రాత్రే పోలీసులతో కొట్టించి, గుర్రాలతో తొక్కించి మేం ఖాళీ చేయించటం లేదు. రంగనాయక్‌సాగర్, కొండపోచమ్మ.. ఇలా ఎక్కడికైనా నేను వస్తా. నేడు మూసీ నది కాలుష్యానికి ప్రతీకగా మారింది. 1600కు పైగా నివాసాలు పూర్తిగా మూసీ నది గర్భంలో ఉన్నాయి. మల్లన్నసాగర్‌లో మునిగిపోయిన 14 గ్రామాల్లో ఎలా వ్యవహరించారో తెలుసా? మేం ఉన్నపళంగా, నిర్దయగా ఎవరినీ ఖాళీ చేయించలేదు. నిర్వాసితులకు రెండుపడక గదుల ఇళ్లు కేటాయించి, రూ.25వేలు ఇచ్చాం. చెరువుల్లో అక్రమంగా నిర్మించుకున్న భవనాలనే హైడ్రా కూల్చింది. మూసీ పరివాహకంలో ఎవరి ఇళ్లను హైడ్రా కూల్చలేదు. చినుకు పడితే చాలు హైదరాబాద్‌లో గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతోంది. రోడ్లపై పడిన వర్షపు నీరు చెరువుల్లోకి, నదుల్లోకి చేరాలా.. అలాగే రోడ్లపై ఉండాలా?" అని సీఎం ప్రశ్నించారు.

**ఆ ముగ్గురూ మూసీ ఒడ్డున ఉంటారా? :** "మూసీ సుందరీకరణ కోసం ప్రణాళికలు రూపొందించామని కేటీఆర్ అనలేదా? అడ్డుకుంటున్న నేతలు 3 నెలలు మూసీ ఒడ్డున జీవించాలి. కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల 3 నెలలు మూసీ ఒడ్డున ఉండాలి. వాళ్లు 3 నెలలు అక్కడ ఉంటామంటే కావాల్సిన వసతులు కూడా కల్పిస్తాం. ఆ ముగ్గురూ మూడు నెలలు అక్కడ ఉంటే.. ఈ ప్రాజెక్టును ఆ పేస్తాం. మూసీ పరివాహకంలోనే ఉండి ప్రజల కోసం పోరాడాలి, వారి జీవితం బాగుందని నిరూపించాలి. మూసీ ప్రజల కోసం ఏం చేద్దామో అసెంబ్లీకి వచ్చి సలహాలు ఇవ్వాలి. మూసీ పునరుజ్జీవం కోసం మీ వద్ద ఉన్న ప్రణాళిక చెప్పండి. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సూచనలు, సలహాలు ఇవ్వాలి. విపక్ష నేతల సందేహాలు ఏమిటో చెప్పాలి" అని సీఎం ప్రశ్నించారు.



## అయినను పోయి రావలె హస్తినకు

### సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ ఎద్దేవా

హైదరాబాద్: 'అయినను పోయి రావలె హస్తిన'కు అని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎద్దేవా చేశారు. సీఎం దిల్లీ పర్యటనలపై ఆయన 'ఎక్స్'లో విమర్శలు చేశారు. "సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీ పర్యటనలతో రాష్ట్రానికి రూపాయి లాభం లేదు. దిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలతో సిల్వర్ జూబ్లీ చేశారు. మూసీ, హైడ్రా పేరుతో పేదోళ్ల పొట్ట కొట్టారు. 420 హామీలను మడతపెట్టి మూలకు వేశారు.

పండగలు లేవు.. ఆడబిడ్డలకు చీరలు అందలేదు. అవ్వా తాతలు అనుకున్న పింఛన్ లేదు. తులం బంగారం జాడే లేదు.. అయినను పోయి రావలె హస్తినకు" అని కేటీఆర్ పేర్కొన్నారు.




## మందుబాబులకు బిగ్ షాక్..

## పెరగనున్న మద్యం ధరలు

హైదరాబాద్: తెలంగాణలో మద్యం ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం వస్తోంది. ఈ ఏడాది కూడా మద్యం ద్వారా భారీగా ఆదాయం ఆర్జించాలని తెలంగాణ సర్కార్ భావిస్తోంది. అందులో భాగంగానే మద్యం ధరల పెంపునకు సిద్ధమైనట్లు సమాచారం. సాధారణంగా బీర్ల ఉత్పత్తి కేంద్రాలకు చెల్లించే ధరలను ప్రభుత్వం ప్రతి రెండేళ్లకొకసారి పెంచుతుంది. అలాగే ఈసారి వివిధ రకాల మద్యంపై రూ. 20 నుంచి రూ. 150 పెంచాలని ప్రభుత్వాన్ని బ్రూవరీలు కోరాయి. ఏటా బతుకమ్మ, దసరా సందర్భంగా రాష్ట్రంలో లిక్కర్ అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయి. ఈసారి కూడా మందుబాబులు అదే ఒరవడిని కొనసాగిస్తూ భారీ రికార్డు నెలకొల్పారు. కేవలం 10 రోజుల వ్యవధిలో రూ.1,100 కోట్లకుపైగా మందును తాగేశారు. పది రోజుల్లో వెయ్యి కోట్ల మేర మద్యం విక్రయాలు జరిగినట్లు ఆబ్కారీ అధికారులు చెబుతున్నారు. బార్లు, మద్యం దుకాణాలతో పాటుగా పబ్‌లలోనూ అమ్మకాలు పెరిగాయి. దీంతో సర్కార్ ఖజానాకు.. మద్యం భారీగా ఆదాయం తెచ్చి పెట్టింది. మద్యం అమ్మకాల్లో ఎప్పటిలాగే హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రంలో 2 వేల 260 మద్యం దుకాణాలు, 1,171బార్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. వీటితో పాటుగా పబ్బుల్లోనూ మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఏటా దసరా వేళ తెలంగాణలో మద్యం ఎక్కువ మొత్తంలో అమ్ముడవుతుంది. ఈ సారి అదే అంచనాతో ముందుగానే ఎక్సైజ్ శాఖ అధికంగా మద్యం నిల్వలను సిద్ధం చేసుకుంది. ఆర్డర్లు కూడా ఊహించిన దాని కన్నా అధికంగా ఉండటంతో రాష్ట్ర సర్కార్ ఖజానాకు కాసుల వర్షం కురిసింది. బార్లు సైతం తగినంత స్టాక్‌ను అందుబాటులో ఉంచాయి. దసరాకు ముందు నుంచే మొదలైన మద్యం కిక్కు శని, ఆదివారాల్లో పీక్స్‌కు చేరింది. సెప్టెంబర్ 30 వరకు 2 వేల 838 కోట్ల అమ్మకాలు జరగ్గా... అక్టోబర్ నెల ప్రారంభం నుంచి 11వ తేదీ వరకు రూ 1,100 కోట్ల మేర విలువైన 10 లక్షల 44వేల కేసుల మద్యం అమ్మకాలు జరిగినట్లు ఆబ్కారీ అధికారులు చెబుతున్నారు. 10 రోజులవ్యవధిలోనే 17 లక్షల 59 వేల బీర్లు అమ్ముడుపోయాయట. మద్యం అమ్మకాల్లో ఉమ్మడి రంగారెడ్డి టాప్‌లో ఉండగా ఉమ్మడి కరీంనగర్, నల్లగొండ, వరంగల్ జిల్లాలు తర్వాతి మూడు స్థానాల్లో ఉన్నాయి.

**స్వల్పంగా తగ్గిన ఆదాయం..** ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో మద్యం అమ్మకాలు ప్రభుత్వానికి భారీ ఆదాయాన్ని సమకూర్చాయి. గత ఏడాది అక్టోబర్ 1 నుంచి 10వ తేదీతో పోలిస్తే ఈ ఏడాది ఇదే సమయంలో పది రోజులకుగానూ అమ్మకాలు కాస్త తగ్గాయి. గ్రేటర్ హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, శంషాబాద్, సరూర్‌నగర్, వికారాబాద్ జిల్లాల పరిధిలో 674 మద్యం దుకాణాలు ఉండగా, 2023లో మద్యం అమ్మకాల ద్వారా రూ.317 కోట్ల 21 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రూ.312 కోట్లే ఖజానాకు వచ్చింది. గతంతో పోల్చితే ఎక్సైజ్ ఆదాయం రూ.5 కోట్ల 18 లక్షలు తగ్గడం గమనార్హం. బడ్జెట్ ప్రవేశ పెట్టగా వ్యవసాయానికి ఎక్కువ ప్రియారిటీ ఇచ్చారు. అయితే బడ్జెట్ సమావేశాల తర్వాత తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకోబోతున్నట్టు తెలుస్తుంది..పండుగలు, పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు ఖచ్చితంగా మద్యం ఉండాల్సిందే . ఎన్నికల సమయాల్లో మందు ఏరులై పారుతుంది. మద్యంతో ఎంజాయ్ చేస్తున్న మందుబాబులకు ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం పెద్ద షాకే ఇవ్వబోతుంది. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మద్యం ఆదాయాన్ని అదనంగా మరో రూ.5,318 కోట్లకు పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# తెలంగాణా మంత్రివర్గ విస్తరణకు

# 'మహా' దెబ్బ!




## మహారాష్ట్ర ఎన్నికలు పూర్తయ్యాకే!!

హైదరాబాద్ : తెలంగాణా మంత్రివర్గ విస్తరణకు మహారాష్ట్ర ఎన్నికల రూపంలో పెద్ద దెబ్బ పడేట్లుంది. రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రివర్గం ఏర్పడి ఇప్పటికి పదిమాసాలవుతోంది. రేవంత్ తో పాటు మంత్రివర్గంలో 11 మంది ఉన్నారు. మంత్రివర్గంలో 17 మందికి ఛాన్సుంటుంది. ఖాళీగా ఉన్న ఆరు స్థానాలను భర్తీ చేయటానికి రేవంత్ చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారు. అయితే ఎప్పటికప్పుడు ఏదోక అవాంతరం ఎదురవుతున్న కారణంగా మంత్రివర్గ విస్తరణ వాయిదా పడుతోంది. రెండునెలల నుండి మంత్రివర్గ విస్తరణలో చోటు సాధించేందుకు చాలామంది సీనియర్లు చాలా గట్టి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. జిల్లాలు, కులాల వారీగానే కాకుండా అధిష్టానం దగ్గర తమకున్న పలుకుబడి కారణంగా ఎవరికి వారు మంత్రివర్గంలో చోటుకోసం రేవంత్ పై అన్నీ రకాలుగా ఒత్తిళ్ళు తీసుకొస్తున్నారు. నెలన్నర క్రితమే మంత్రివర్గ విస్తరణకు మీడియా ముహూర్తంకూడా పెట్టేసింది. విస్తరణకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కూడా బాగా ప్రచారం జరిగింది. అయితే హర్యానా, జమ్మూ-కాశ్మీర్ ఎన్నికల నోటిఫికేషన్ రావటంతో విస్తరణ ప్రచారానికి బ్రేకులు పడింది. జమ్మూలో మిశ్రమ ఫలితాలు వచ్చినా హర్యానాలో కాంగ్రెస్ ఓడిపోయింది. హర్యానా ఫలితంతో సంబంధంలేకుండా తెలంగాణాలో మంత్రివర్గ విస్తరణకు రేవంత్ పైన సీనియర్లు ఒత్తిళ్ళు పెంచేస్తుంటే ఇదే విషయమై రేవంత్ కూడా అధిష్టానంలో ముఖ్యనేతలతో పదేపదే విస్తరణ విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. ఈరోజో రేపో విస్తరణ జరుగుతుందని అందరు అనుకుంటున్న సమయంలో సడెన్ గా మహారాష్ట్ర, జార?ండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ జారీఅయ్యింది. రెండు రాష్ట్రాల్లోను అధికారంలోకి రావటం కాంగ్రెస్ లేదా ఇండియా కూటమికి చాలా కీలకమే అయినా రెండింటిలో మహారాష్ట్ర మరీ మరీ కీలకం. మహారాష్ట్ర ఎన్నికలు నెలరోజుల్లో పెట్టుకుని ఇపుడు తెలంగాణా మంత్రివర్గ విస్తరణ చేయటం మంచిదికాదని అధిష్టానం ముఖ్యులు అనుకుంటున్నట్లు పార్టీవర్గాల సమాచారం. మంత్రివర్గ విస్తరణకు ఒకపుడు హర్యానా ఎన్నికలు అడ్డుపడితే ఇపుడు మహారాష్ట్ర ఎన్నికలు అడ్డుపడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మహారాష్ట్రతో తెలంగాణాలోని జిల్లాలు ఆదిలాబాద్, నిజామాబాద్ సరిహద్దులు పంచుకుంటున్న విషయం తెలిసిందే. కాబట్టి మహారాష్ట్ర ఎన్నికల్లో తెలంగాణాలో సీనియర్లు కీలకపాత్ర పోషించాల్సుంటుంది. ఇపుడు గనుక మంత్రివర్గ విస్తరణ చేస్తే అవకాశాలు దక్కనివారు అలిగి నానా రచ్చచేసే అవకాశముంది. ఇదే జరిగితే మంత్రివర్గ విస్తరణ ప్రభావం మహారాష్ట్ర ఎన్నికలపైన నెగిటివ్ గా పడుతుంది. అందుకనే పై రెండు రాష్ట్రాల ఎన్నికలు అయిపోయిన తర్వాతే తెలంగాణా మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశాలున్నాయని పార్టీవర్గాల సమాచారం.

**హీట్ పెంచేసిన మహేష్ :** మంత్రివర్గ విస్తరణ తొందరలో జరగబోతుందనే పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలతో ఒక్కసారిగా హీట్ పెరిగిపోయింది. రేవంత్ తో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధరబాబు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఢిల్లీ పర్యటన ఫైనల్ అయ్యింది. దాంతో ఆశావహులు, సీనియర్లు మరింతగా అలర్టయ్యారు. ఇపుడు ప్రాతినిధ్యంలేని జిల్లాలతో పాటు ఆదిలాబాద్ జిల్లాలో ప్రేమ్ సాగర్ రావు, వివేక్, వినోద్, నల్గొండ జిల్లాలో కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి, నిజామాబాద్ జిల్లాలో సుదర్శన్ రెడ్డి లాంటి అనేకమంది సీనియర్ల హడావుడి మొదలుపెట్టేశారు.

ఇంతలో సడెన్ గా రెండు రాష్ట్రాల ఎన్నికల నోటిఫికేషన్ జారీఅయ్యింది. దాంతో సీనియర్లు, ఆశావహుల్లో హడావుడిపై నీళ్ళుచల్లేసినట్లయ్యింది. మరి చివరకు ఏమి జరుగుతుందో చూడాల్సిందే.

# సంపాదకీయం

## పాక్ లో మార్నింగ్ వాక్.. మీటింగ్ లో అటాక్.. దటీజ్ జైశంకర్

ఆయనంతే.. ఎక్కడైనా ముక్కుసూటే.. ఆయన చెప్పేది అవతలి వారికి మెత్తగానే అయినా గట్టిగా తగులుతుంది. అది పాశ్చాత్య దేశాలపై కౌంటర్ అయినా.. పాకిస్థాన్ పై అటాక్ అయినా.. ఆయనే భారత విదేశాంగ మంత్రి జైశంకర్. షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ సమ్మిట్ (ఎస్సీవో) సదస్సులో పాల్గొనడానికి పాకిస్థాన్ వెళ్లిన ఆయన వివిధ దేశాల ప్రతినిధులతో సమావేశం అవుతున్నారు. దాదాపు పదేళ్ల తర్వాత పాకిస్థాన్ లో కాలుపెట్టిన భారత విదేశాంగ మంత్రి జైశంకర్ కావడం గమనార్హం. ఇక 2015లో చివరిసారిగా దివంతగ సుష్మా స్వరాజ్ పాకిస్థాన్ పర్యటనకు వెళ్లారు. వాస్తవానికి ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పాకిస్థాన్ లో భారత మంత్రి ఒకరు పర్యటిస్తారా? అనే సందేహాలు నెలకొన్నాయి. కానీ, జైశంకర్ ను కీలక సమావేశానికి పంపింది మోదీ ప్రభుత్వం.

**పాక్ గడ్డపై కాలినడక :** ఒకప్పుడు అవిభాజ్య భారత దేశంలో కలిసి ఉన్న పాకిస్థాన్ దేశ విభజన తర్వాత మనుకు ప్రధాన శత్రువుగా మారిపోయింది. అలాంటి పాక్ లో అడుగుపెట్టిన జై శంకర్ బుధవారం ఎక్స్ లో ఓ ఫొటో పెట్టారు. ఇస్లామాబాద్ లో ఆయన మార్నింగ్ వాక్ చేస్తున్న ఫొటో అది. "మా (భారత) హైకమిషన్ ప్రాంగణంలో భారత్-పాక్ దేశాల సహచరులతో మార్నింగ్ వాక్" అంటూ దానికి రైటప్ ఇచ్చారు. ఎస్సీవో సమ్మిట్ కోసం మంగళవారమే పాక్ వెళ్లిన జై శంకర్ బుధవారం పాక్ ప్రధాని షాబాజ్ షరీఫ్ కూడా పాల్గొన్న ఇస్లామాబాద్ లోని జిన్నా కన్వెన్షన్ సెంటర్‌లో ప్రసంగించారు. కాగా, భారత్, చైనా, రష్యా, బెలారస్, కజకిస్థాన్, కిర్గిజిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్ తదితర దేశాలు ఎస్సీవో కూటమిగా ఏర్పడ్డాయి. ఇస్లామాబాద్ భేటీలో ఇరాన్ మొదటి ఉపాధ్యక్షుడు, మంగోలియా ప్రధాని పాల్గొంటున్నారు.

**షాబాజ్ తో మాట.. ఆపై చురక...** షాంఘై సహకార సంస్థ సదస్సుకు వెళ్లిన జైశంకర్ పాకిస్థాన్ ప్రధాని షాబాజ్ షరీఫ్ తో మాట కలిపారు. అదీ కొద్దిసేపే. అయితే, ఇది పాక్ ప్రధాని మంగళవారం రాత్రి ఇచ్చిన అధికారిక విందులోనే. జైశంకర్, షాబాజ్ లు షేక్ హ్యాండ్ చేసుకున్నారు. కాగా, బుధవారం సదస్సులో మాట్లాడుతూ.. పాకిస్థాన్ గడ్డపైనే పాకిస్థాన్ కు జైశంకర్ చురకలేశారు. క్రాస్ బోర్డర్ టెర్రరిజం (సీమాంతర ఉగ్రవాదం) గురించి ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. 'నమ్మకం, సహకారం, స్నేహం లోపిస్తే పొరుగువారు దూరం అవుతారంటూ' భారత్-పాకిస్థాన్ సంబంధాలు ఎందుకు దెబ్బతిన్నాయో ఆత్మపరిశీలన చేసుకోవాలని కూడా సూచించారు. 'సరిహద్దుల్లో తీవ్రవాదం, ఉగ్రవాదం, వేర్పాటువాద కార్యకలాపాలు ఉంటే.. ఆ రెండు దేశాల మధ్య వాణిజ్యం, అనుసంధానం, ప్రజల మధ్య సంబంధాలకు అవకాశం ఉండదు' అని జైశంకర్ కుండబద్దలు కొట్టారు. అయితే పాకిస్థాన్ గురించే ఇదంతా అని స్పష్టంగా తెలిసిపోతోంది. ఎస్సీవో సదస్సులో మాట్లాడాక జైశంకర్ ట్వీట్ చేశారు. సదస్సులో మన దేశ ప్రకటనను వినిపించానని కల్లోల ప్రపంచంలో మనం ఎదుర్కొంటున్న సవాళ్లకు తగినవిధంగా స్పందించాలని కోరినట్లు తెలపడం గమనార్హం. కాగా, 2019 ఫిబ్రవరిలో పూల్వామాలో సీఆర్పీఎఫ్ జవాన్ల కాన్వాయ్ పై పాకిస్థాన్ మద్దతు ఉన్న జైషే మొహమ్మద్ సంస్థ భయంకర దాడికి పాల్పడింది. దీంతో 40 మంది జవాన్లు వీర మరణం పొందారు. భారత వాయుసేన ఆ వెంటనే ఫిబ్రవరి 26న పాక్ లోని బాలాకోట్ లో ఉన్న జైషే స్థావరాలపై బాంబులు వేసింది. అప్పటి నుంచి రెండు దేశాల సంబంధాలు మరింత దిగజారాయి.

# చిరు ధాన్యం.. సాగులో దైన్యం



కరీంనగర్: జొన్న అంబలి, రాగి జావ, మక్క గట్క, ఉలవ చారు, కొర్రల దోశ, సామల ఉప్మా.. ఇలా చిరుధాన్యాల ఆహారాలపై జనంలో ఆసక్తి పెరుగుతోంది. మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ ఉంది. కానీ కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలో చిరుధాన్యాల సాగు గణనీయంగా తగ్గిపోతోంది. సాగునీటి లభ్యత పెరిగి రైతులు వరి సాగుకే మొగ్గు చూపుతుండటంతో.. కీలకమైన చిరుధాన్యం పంటల జాడ కనిపించడం లేదు. పెరుగుతున్న వ్యాధులు, మారుతున్న జీవన శైలిలో వీటి ప్రాధాన్యం పెరుగుతున్నా.. స్థానికంగా పంటలు లేక ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి మన వద్ద నెలకొంది.

ఉమ్మడి జిల్లాలో 2020లో వరి 7.17 లక్షల ఎకరాల్లో సాగు చేయగా 2024లో 8.19 లక్షల ఎకరాల్లో నాట్లు వేశారు. నాలుగేళ్లలో 1,74,272 ఎకరాల్లో ఈ పంట పెరగడం రైతులు ఆ పంట సాగుపై చూపుతున్న ఆసక్తిని తెలుపుతోంది. పద్నాలుగు లక్షల ఎకరాలకుపైగా వ్యవసాయ భూమి ఉన్న నాలుగు జిల్లాల్లో చిరుధాన్యాలను పండించేందుకు అనువైన వాతావరణం ఉందని ఆయా సందర్భాల్లో వ్యవసాయశాస్త్రవేత్తలు, అధికారులు చెప్పారు. మన ప్రాంత నేలలు అన్ని పంటలకు అనుకూలం. పైగా పంటల మార్పుతో దిగుబడి ఎక్కువగా వస్తుంది. అయితే వరి సాగు విపరీతంగా పెరుగుతోంది. సమృద్ధిగా వానలు కురుస్తుండటం, జలాశయాల ద్వారా నీరు అందుతుండటంతో సాగు యోగ్యత పెరిగింది. 2020లో 10.49 లక్షల ఎకరాల్లో అన్ని పంటలు వేయగా.. ఈ ఏడాది 11.65 లక్షల ఎకరాలకు చేరింది. సాగు భూమి పెరగడంతో ప్రధాన పంటల స్థాయి అదే విధంగా పెరిగింది. చిరుధాన్యాల పరంగా మాత్రం పురోగతి లేదు. మొత్తం సాగైన విస్తీర్ణంలో నాలుగేళ్ల కిందట మొక్కజొన్న, కందులతోపాటు ఇతర తృణధాన్యాల శాతం 7.26 ఉండగా ప్రస్తుతమది.. 3.97 శాతానికి పడిపోయింది.

**రోజుకు 850 కిలోలు..**

నాలుగు జిల్లాల్లో కొర్రలు, అండుకొర్రలు, ఊదలు, అరకలు, సజ్జలు, రాగుల కొనుగోలు పెరుగుతోందని వ్యాపారులు చెబుతున్నారు. రోజులో దాదాపుగా 850 కిలోలు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇక్కడ పంటలు లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్ మార్కెట్‌కు ఇవి వస్తుండటంతో అక్కడి నుంచి తెప్పిస్తామంటున్నారు. ఇవన్నీ కొంచెం అటూ ఇటుగా రూ.200-300 కిలో చొప్పున అమ్ముతున్నారు. ఇలా నెలకు 255 కింటాళ్లు, ఏడాదికి 3,060 క్వింటాళ్లు తినడం కోసం జిల్లా వాసులు కొనుగోలు చేస్తున్నారు. మొక్కజొన్న, కందులు, పెసలు, మినుములు కాకుండా కేవలం చిరు ధాన్యాల వ్యాపారమే ఏటా రూ.6.25 కోట్లను దాటుతుండటం గమనార్హం.! ఈ నేపథ్యంలో వ్యవసాయ వార్షిక ప్రణాళికలో విధిగా గ్రామాల వారీగా చిరుధాన్యాల సాగు లక్ష్యాన్ని నిర్ణయించి ఆ దిశగా అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది. పెట్టుబడి తక్కువగా ఉండటం, దిగుబడి ఎక్కువగా వస్తుందనే విషయాన్ని రైతులకు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు సమగ్రంగా వివరించి ఆసక్తి పెంచాలి. కచ్చితంగా కొంత విస్తీర్ణంలో ప్రతి రైతు ఏదో ఒక చిరుధాన్యం పంటని వేయాలనే అవగాహనను పెంచుతేనే రైతులు దృష్టి పెట్టే అవకాశముంది.

**సాగు తగ్గడానికి కారణాలివీ..**

వ్యవసాయం అంటేనే వరి అనే విధంగా పరిస్థితులు మారడం.
ఇతర పంటలు వేస్తే మార్కెటింగ్ సమస్య ఉండటం.
ప్రభుత్వ రాయితీలు లేకపోవడం, విత్తనాల లభ్యత కష్టమవడం.
ఒకవేళ పంట పండించినా స్థానికంగా అమ్మే వీలు లేకపోవడం.

**చిరుధాన్యాలతో లాభాలివీ..**

ప్రొటీన్, పీచు, విటమిన్స్ అధికంగా ఉంటాయి.
రోగనిరోధక శక్తికి దోహదపడతాయి.
తక్కువ నీటితోనే పండుతాయి.
వీటి సాగుతో భూమి కూడా సారవంతం అవుతుంది.

# విద్యుత్తు వెలుగుల రామగుండం



గోదావరిఖని : రాష్ట్రంలోనే అతిపెద్ద విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలకు నిలయంగా రామగుండం మారనుంది. ఇప్పటికే 4,200 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తోంది. రానున్న రోజుల్లో మరో 3,700 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పే అవకాశముంది. రామగుండం ఎన్టీపీసీ, తెలంగాణ జెన్‌కో, సింగరేణి ద్వారా భారీ విద్యుత్తు ప్రాజెక్టులు నిర్మించేందుకు ప్రణాళికలు చేస్తున్నారు.

ఇప్పటికే 2,600 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను ఎన్టీపీసీ నెలకొల్పింది. వీటితోపాటు ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు ద్వారా 1600 మెగావాట్ల ఉత్పత్తి కేంద్రాలు పనిచేస్తున్నాయి. త్వరలోనే మరో 2400 మెగావాట్ల కేంద్రాలను నిర్మించనుంది. తాజాగా తెలంగాణ జెన్‌కో 800 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సూత్రప్రాయంగా ప్రకటన చేసింది. దీంతోపాటు హైడ్రో ప్రాజెక్టు ద్వారా 500 మెగావాట్లను ఉత్పత్తి చేసేందుకు సింగరేణి ప్రతిపాదనలు తయారు చేసింది.

**సూపర్ క్రిటికల్ కేంద్రం**

రామగుండం బి-థర్మల్ విద్యుత్తు కేంద్రంలో.. 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. 62.5 మెగావాట్ల విద్యుత్తు కేంద్రం స్థానంలో దీనిని నిర్మించాలన్న డిమాండ్ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇటీవల పరిశీలించి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సూత్రప్రాయంగా ప్రకటన చేశారు. దీన్ని జెన్‌కో, సింగరేణి సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టేందుకు ప్రణాళికలు చేయనున్నట్లు తెలిపారు. కాగా 1972, జూన్‌లో నిర్మించిన 62.5 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం.. 50 ఏళ్లకు పైగా సేవలందించింది.

**హైడ్రో విద్యుత్తు..**

సింగరేణి యాజమాన్యం మూసివేసిన మేడిపల్లి ఓసీపీలో.. హైడ్రో విద్యుత్తు కేంద్రాన్ని రూ.2,535 కోట్లతో నిర్మించేందుకు ప్రణాళికలు చేశారు. మేడిపల్లి ఓసీపీ క్వారీలో ఉన్న నీటిని పంపింగ్ ద్వారా ఎత్తిపోసి.. తిరిగి దిగువకు సరఫరా చేయడంతో ఏర్పడే ప్రక్రియ ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు. దీనికి సంబంధించిన సర్వే పనులను సింగరేణి ఇప్పటికే పూర్తిచేసి.. ప్రాజెక్టు నివేదికలు కూడా తయారుచేసింది. ఏడాదికి 1560 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చని అంచనా వేస్తున్నారు. 40 ఏళ్ల జీవితకాలంతో రూపొందించే ఈ హైడ్రో కేంద్రం ద్వారా.. సింగరేణి 500 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే అవకాశముంది.


**ఎన్టీపీసీ రెండో దశ పనులు**

ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు రెండో దశ పనులను త్వరలోనే చేపట్టనున్నారు. మొదటి దశలో 1600 మెగావాట్ల రెండు యూనిట్లను నిర్మించిన ఎన్టీపీసీ.. రెండో దశలో 2,400 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను నిర్మించేందుకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసింది. తెలంగాణ విభజన చట్టంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 4 వేల మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలను నిర్మించాల్సి ఉంది. అందులో భాగంగానే రామగుండం ఎన్టీపీసీలో ఇప్పటికే 1600 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలను నిర్మించారు. మరో 2400 మెగావాట్ల మూడు యూనిట్ల రెండో దశ పనులను కూడా త్వరలో ప్రారంభించనున్నారు.

# సుందరీకరణ మాటున ఆక్రమణలు

హైదరాబాద్ : హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని చెరువులను ఆక్రమించేందుకు కొన్ని రియల్ సంస్థలు కార్పొరేట్ సామాజిక బాధ్యత ముసుగులో అక్రమాలకు తెరతీశాయి. శేరిలింగంపల్లి, గండిపేట్ మండలాల్లో చెరువులను సంరక్షిస్తామని కొన్ని రియల్ సంస్థలు జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులతో ఒప్పందాలు కుదుర్చుకొని బఫర్‌జోన్లు, ఎఫ్‌టీఎల్‌లను ఆక్రమించుకుంటున్నాయి. రెండు మండలాల పరిధిల్లో 20 చెరువులను సంరక్షిస్తామంటూ రియల్ సంస్థల ప్రతినిధులు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. కొద్దినెలల నుంచి పనులు చేస్తున్నారు. ఇందులో 12 చెరువులను రింగ్‌బండ్ పేరుతో క్రమంగా స్వాధీనం చేసుకుంటున్నా రు. మరో రెండు చోట్ల గేటెడ్ కమ్యూనిటీల మురుగును చెరువులోకి మళ్లిస్తున్నారు. వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు..చెరువులను సుందరీకరిస్తామంటూ రియల్ సంస్థల ప్రతినిధులు అధికారులకు వివరించారు. రింగ్‌బండ్, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లు నిర్మిస్తామంటూ చెప్పారు. తమ విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలు అక్కడే నిర్మించారు. సమీపంలో సరిహద్దులు తొలగించి బఫర్‌జోన్‌లో ప్రహారీలు నిర్మించుకున్నారు. ఫుల్‌ట్యాంక్ లెవల్‌లో సుందరీకరణ పనులు చేపట్టారు. ఆ భూముల విలువ రూ.300 కోట్లకు పైమాటే..

చెరువుల సుందరీకరణ పేరుతో స్వాధీనం చేసుకున్న భూముల విలువ రూ.300కోట్లకు పైమాటే.. నల్లగండ్ల చెరువు బఫర్‌జోన్‌ను ఓ రియల్ సంస్థ ఆక్రమించింది. దీని విలువ రూ.70కోట్లు.



మియాపూర్ పటేల్ చెరువులో ఓ రియల్ సంస్థ బఫర్‌జోన్ పరిధిలోకి వచ్చే ప్రాంతమంతా నిర్మాణాలు చేపట్టింది. అధికారుల దృష్టి మళ్లించేందుకు ఎఫ్‌టీఎల్ లో సుందరీకరణ చేపట్టింది. మల్కంచెరువును అభివృద్ధి చేసేప్పుడు ఓ రియల్ సంస్థ తమ నిర్మాణాలను బఫర్‌జోన్‌లోకి తీసుకొచ్చింది. వర్షాలు కురిసినప్పుడు నీళ్లు అటువైపురాకుండా నీటిని చెరువులోకి మళ్లించారు. గోపిచెరువు బఫర్‌జోన్‌లో భారీగా నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా రేకుల షెడ్లను బఫర్‌జోన్‌లో నిర్మించారు. కొద్దిరోజుల వరకూ బఫర్‌జోన్‌లో నీళు న్నా.. మట్టితో పూడ్చేశారు.

# విధుల్లో చేరిన నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు

శామీర్ పేట, (గరుడ వార్త) : డిఎస్సి-2024 లో భాగంగా నూతనంగా ఏ ఎంపికైన ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. శామీర్ పేట, ముదుచింతలపల్లి మండలాలకు ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు గురువారం శామీర్ పేట మానవ వరుల కేంద్రం వద్ద స్వాగతం పలికి వారికి ఉపాధ్యాయ ఐడి కార్డులు, దరఖాస్తులను మండల



రిసోర్స్ పర్సన్ వెంకట్ రాంరెడ్డి అందించారు. ఈ సందర్భంగా పిఆర్టియు మేడ్చల్ -మల్కాజ్ గిరి జిల్లా ప్రధాన కార్యదర్శి రామిడి వెంకట్రామ్ రెడ్డి, అధ్యక్షుడు టి.శ్రీధర్ పిఆర్టియు మేడ్చల్ -మల్కాజ్ గిరి జిల్లా శాఖ పక్షాన నూతన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అడ్డగోలుగా తిరిగేస్తున్నాయ్!

హైదరాబాద్ : ఈ రెండు ఘటనలే కాదు.. రోడ్లపైకి ఇష్టారీతిన దూసుకొస్తున్న భారీ వాహనాలు, ట్రక్కులు అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నాయి. నిర్దేశిత వేళల్లోనే నగరంలోకి రావాలన్న నిబంధనలు ఉన్నా.. కొందరు డ్రైవర్లు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు.

ఇలా చేస్తుంటే..: ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరిలో కొత్త నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చారు. భారీ వాహనాల ప్రవేశంపై ఆంక్షలు విధించారు. కొన్ని నెలలు బాగున్నా.. కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంతో వాటి అమలు అటకెక్కింది.

29.08.2024 పాఠశాల ముగిశాక ఆరో తరగతి విద్యార్థిని తల్లితో కలిసి ద్విచక్రవాహనంపై ఇంటికెళ్తోంది. హబ్సిగూడ దగ్గర రోడ్డు దాటుతుండగా భారీ వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన చిన్నారి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది.

17.08.2024

ఆటోలో పదో తరగతి విద్యార్థిని పాఠశాలకు వెళుతుండగా వెనుక



నుంచి దూసుకొచ్చిన లారీ ఢీకొంది. ఈ తాకిడికి ఆటో ముందున్న బస్సు కింద ఇరుక్కుపోయింది. అందులో విద్యార్థిని మరణించింది. ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు.

**ఇవీ నిబంధనలు**

నగరంలోని కీలకమైన 94 మార్గాల్లో జాతీయ పర్మిట్, అంతర్ జిల్లాల్లో ప్రయాణించే భారీ వాహనాలు, లారీలు, ట్రక్కులు, టస్కర్లు వంటి వాణిజ్య వాహనాల ప్రవేశం, పార్కింగ్‌పై పూర్తిగా నిషేధం.

స్థానిక లారీలు, నిర్మాణ సామగ్రి తరలించే వాహనాలు, ట్రక్కులు, టస్కర్లు, ట్రైలర్లు, ఎర్త్ మూవింగ్(జేసీబీ) తదితర వాహనాల రాకపోకలు, ఐడల్ పార్కింగ్(ఇంజిన్ ఆన్‌లో ఉంచి నిలపడం) ఉదయం 7 నుంచి రాత్రి 11 గంటల వరకు అనుమతించరు. రాత్రి 11 నుంచి ఉదయం 7 వరకు ముందుగా నిర్దేశించిన 64 మార్గాల్లో మాత్రమే అనుమతిస్తారు. గూడ్సు వాహనాలు(3.5- 10 టన్నుల బరువు) ఉండే డీసీఎం, ఐచర్ తదితర వాహనాల ప్రయాణం, ఐడల్ పార్కింగ్‌ను ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12, సాయంత్రం 4 నుంచి 9 గంటల వరకు అనుమతించరు.

నిర్మాణ రంగ వస్తువులు, వ్యర్థాలు తరలించే 2-6 టన్నుల బరువుండే వాహనాలు, చిన్న టిప్పర్లు ఉదయం 9-11.30 మధ్య సాయంత్రం 5నుంచి 10 గంటల మధ్య అనుమతించరు.

10 టన్నులకు మించి బరువుండే వాహనాలను ఉదయం 7 నుంచి రాత్రి 11 వరకు నగరంలోకి అనుమతించరు.

**పరిష్కారమేంటి?**

నగర శివార్లలోని ప్రధాన మార్గాల్లోనే భారీ వాహనాల రాకపోకలు అడ్డుకునేలా ప్రత్యేక వ్యవస్థ ఉండాలి.

రాత్రి వేళ నగరంలోకి వచ్చినా.. తెల్లవారాక ఖాళీ ప్రాంతాల్లో వాటిని నిలిపేసేలా చర్యలు తీసుకోవాలి.

**ఇలా ఉల్లంఘన**

హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల ట్రాఫిక్ పోలీసుల మధ్య సరిహద్దు సమస్యలు వస్తున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు భారీ వాహనాన్ని ఎలా అనుమతించారని విమర్శలు వ్యక్తమైతే ముందు శివారు ప్రాంతాల్లోనే అడ్డుకోలేకపోయారని హైదరాబాద్ పోలీసులు అంటున్నారు.

నగరంలో రద్దీ సమయాల్లో ట్రాఫిక్ గబిబిజిగా ఉంటుంది. ఇక్కడి పరిస్థితులపై లారీ డ్రైవర్లకు అవగాహన లేకపోవడం ప్రమాదాలకు కారణమవుతోంది. భారీ వాహనాలు ఎక్కువగా ఇన్నర్ రింగురోడ్డుపై, సికింద్రాబాద్-ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, బేగంపేట తదితర ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి.

నాచారం, ఉప్పల్, మల్లాపూర్, ఈసీఐఎల్‌లో పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో ఇక్కడ రాకపోకలు ఎక్కువ.

# అవాంతరాలు.. అధిగమించి..

పరిగి: పరిగి నియోజకవర్గం పూడూరు మండలం దామగుండం రిజర్వు ఫారెస్టులో భారత నౌకాదళానికి సంబంధించిన నేవీ రాడార్ కేంద్రం (వ్యూహాత్మక కమ్యూనికేషన్ స్టేషన్) ఏర్పాటుకు నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుడుతున్నాయి. నిజానికి పదేళ్ల క్రితమే ఇక్కడ వీఎల్ఎఫ్ స్టేషన్‌కు భారత నౌకాదళం, రక్షణ శాఖ ద్వారా ప్రయత్నాలు ప్రారంభించింది. కేంద్ర పర్యావరణశాఖ నుంచి స్టేజ్ -2 అనుమతులు కూడా లభించాయి. పలు కారణాలతో వాయిదా పడగా స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పట్టుబట్టడం, సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోవడంతో ఖాయమైంది. అయితే కొంత కాలంగా దీనిపై పర్యావరణ ప్రేమికులు, సామాజిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. నేవీ అధికారులు ఈ కోణంలో కూడా ఆలోచించి పర్యావరణానికి ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కథనం

పూడూరు నుంచే పర్యవేక్షణ: అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రం, బంగాళాఖాతంలో తిరిగే నౌకలు, జలాంతర్గాముల నుంచి వచ్చే సంకేతాల్ని పూడూరు నుంచే పర్యవేక్షించడానికి కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాటవుతోంది. దీనికోసమే వీఎల్ఎఫ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.



ఆది నుంచీ వ్యతిరేకత

రాడార్ స్టేషన్ ఏర్పాటుతో రేడియేషన్ ప్రభావంతో ఈ ప్రాంతంలో పర్యావరణం దెబ్బతింటుందని పలువురు పర్యావరణ వేత్తలు, సామాజిక ఉద్యమకారులు ఆదినుంచి వ్యతిరేకిస్తున్నారు. నిరసనలు కూడా చేశారు. మరి కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

అనుమతులు రద్దు చేయాలని భూములను అప్పగించరాదని కోరుతూ గతంలో పూడూరు గ్రామసభలో తీర్మానించి కలెక్టర్‌కు అందించారు. ఇక్కడ పురాతన రామలింగేశ్వర స్వామి ఆలయం ఉంది. ప్రాజెక్టు ఏర్పాటుతో మనుగడపై భక్తుల్లో పలు సందేహాలు నెలకొన్నాయి.

దేశ చరిత్రలో పరిగికి ప్రత్యేక స్థానం

టి.రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే

దేశ రక్షణ వ్యవస్థ పరిగిలో ఏర్పాటు కావడం హర్షించదగ్గ విషయం. చరిత్రలోనే పరిగి పేరు నిలిచిపోతుంది. పర్యావరణానికి ఎలాంటి నష్టం జరగదు. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

ఎలాంటి హానీ ఉండదు

జ్ఞానేశ్వర్, జిల్లా అటవీ అధికారి

రాడార్ కేంద్రం ఏర్పాటుతో పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదు. నేవీకి అప్పగించిన భూమిలో 1.93లక్షల మొక్కలే ఉన్నాయి. అవసరాన్ని బట్టి మాత్రమే తొలగిస్తారు. జీవ వైవిధ్యం, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు తగిన చర్యలు చేపడతారు.

ఆ నివేదికలు బయట పెట్టాలి

ఎం.నాగేశ్వర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పరిగి

రాడార్ స్టేషన్‌తో లక్షలాది మొక్కలు పోవడంతో పాటు పర్యావరణానికి తీవ్రహాని కలుగుతుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమిళనాడులో ఏర్పాటు చేసిన సమయంలో ఎలాంటి హానీ లేదన్న నివేదికలను ప్రజల ముందు ఉంచాలి.

మరో చోటుకు మార్చితేనే మంచిది సత్యానందస్వామి, దామగుండం పరిరక్షణ కమిటీ సభ్యుడువీఎల్ఎఫ్ స్టేషన్‌తో నీరు కలుషితం కావడం, రేడియేషన్ ప్రభావంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదముంది. జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. చుట్టూ పది గ్రామాల ప్రజలపై ప్రభావం ఉంటుంది. దామగుండం రిజర్వు ఫారెస్టు

ఏరియా విస్తీర్ణం - 3260 ఎకరాలు

రాడార్ స్టేషన్‌కు కేటాయించిన భూమి - 2900 ఎకరాలు

అందులో ఉన్న చెట్లు, మొక్కలు సుమారు - 1,93,562

ప్రాజెక్టు అంచనా వ్యయం.. రూ.3,100 కోట్లు

అటవీభూమి అప్పగించేందుకు కంపా నిధులు. రూ.133.54 కోట్లు

భూ సంరక్షణ చర్యలకు నేవీ చెల్లింపులు.. రూ.18.56కోట్లు

# శివారు రైతుకు చేయూత

హైదరాబాద్: హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో పండ్లు కూరగాయలు పండిస్తున్న రంగారెడ్డి జిల్లా రైతులకు చేయూతనందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. వ్యవసాయ, వ్యవసాయేతర అంకుర సంస్థలను స్థాపించేందుకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా రైతుల నుంచే కూరగాయలు, ఉద్యాన పంటలు.. పండ్ల క్రయవిక్రయాలు నిర్వహించేందుకు అవసరమైన అంకుర సంస్థలు ఉండాలని ప్రభుత్వం నిర్ణయించగా.. అధికారులు ఈ మేరకు ఆ సంస్థల వివరాలను సేకరిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో పండ్లు, కూరగాయలను పండించే ప్రాంతాలు హైదరాబాద్‌కు సమీపంలో ఉండడం, రవాణా సౌకర్యం సులభంగా ఉండడంతో అంకుర సంస్థలు ఏర్పాటు చేసేందుకు చాలామంది ఆసక్తి ప్రదర్శిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

మెట్రో నగరాలే లక్ష్యం: అంకుర సంస్థల ఏర్పాటుతో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబయి నగరాలకు పండ్లు, కూరగాయలు, పూలను పంపించేందుకు నెట్‌వర్క్ ఏర్పాటుకానుందని అధికారులు చెబుతున్నారు. ఫైవ్‌స్టార్ హోటళ్లు, కార్పొరేట్ సంస్థలు, ఇతర కంపెనీలకు వీటిని పంపించేందుకు అంకుర సంస్థలు మార్కెటింగ్ చేయనున్నాయి. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాల్లో 75వేల ఎకరాల్లో కూరగాయలు, పండ్లు, పూలను రైతులు పండిస్తున్నారు. కూరగాయలు, ఉద్యాన పంటలను ఎక్కువగా హైదరాబాద్, బెంగళూరు మార్కెట్‌లకు తరలిస్తున్నారు. కూరగాయలు సాగు చేస్తున్న రైతులు బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్, సమీపంలోని రైతుబజార్లలో విక్రయిస్తున్నారు. పెట్టుబడి, రవాణా ఖర్చులు, కొంత లాభం వేసుకుని అమ్మేసుకుంటున్నారు. అంకుర సంస్థలు ఏర్పాటైతే ఈ పంటలకు మార్కెటింగ్‌తో పాటు వ్యవసాయేతర పనులు చేస్తున్న యువకులకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలున్నాయి.

# ఇంటి దొంగలు



మల్యాల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో ఇంటి దొంగలు చేతివాటం చూపుతున్నారు. ఆలయానికి నిత్యం వేలాదిగా భక్తులు తరలివచ్చి తమ శక్తికొద్దీ కానుకలు సమర్పిస్తుంటారు. ఆలయ సిబ్బందిలో కొందరు కానుకలు, సరకులను మాయం చేస్తూ స్వామివారికే శఠగోపం పెడుతున్నారు. తాజాగా ఆలయ నిత్యాన్నదాన సత్రంలో పనిచేసే జూనియర్ సహాయకులు రాములు బియ్యం బస్తాలతోపాటు ఇతర సరకులు మాయం చేసినట్లు అధికారుల విచారణలో తేలడంతో మెమో జారీ చేసిన విషయం విదితమే.

కొండగట్టు అంజన్న ఆలయ పరిసరాల్లో భక్తుల కదలికలు, సిబ్బంది పనితీరుపై నిఘావేయడానికి దాదాపు 60 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటి పర్యవేక్షణకు పోలీసు ఔట్‌పోస్టులో రక్షణ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఆలయ పరిసరాల్లోని సీసీ కెమెరాలను హైదరాబాద్‌లోని పోలీసు కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేశారు. అయినప్పటికీ తరచూ అక్రమాలు, చోరీలు జరగడంపై భక్తులు ఆందోళన చెందుతున్నారు. - ఆరు నెలల కిందట శ్రీనివాసచారి అనే సీనియర్ సహాయకుడు దుకాణాల టెండరు లీజుకు సంబంధించి రూ.52 లక్షలను పలువురు వ్యాపారుల నుంచి వసూలు చేసి ఆలయ ఖాతాలో జమచేయకుండా సొంతానికి వాడుకున్నట్లు అధికారుల విచారణలో తేలడంతో అతడిని సస్పెండ్ చేయడంతోపాటు ఈవో ఫిర్యాదు మేరకు మల్యాల ఠాణాలో కేసు కూడా నమోదు చేశారు. ఈ వ్యవహారంలో గతంలో పనిచేసిన ఈవోను సస్పెండ్ చేయగా మరో ఇద్దరు సూపరింటెండెంట్లకు మెమోలు జారీ చేశారు. సీనియర్ సహాయకుడు ఆలయ నిధులను దుర్వినియోగం చేసినట్లు అధికారులు 8 నెలల తర్వాత గుర్తించడం నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.

దాదాపు ఐదు నెలల కిందట ప్రసాదం తయారీ కేంద్రంలో 20 ఏళ్లుగా పనిచేసిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి హుండీ లెక్కింపు సమయంలో రూ.11,010 తస్కరించి పట్టుబడటంతో ఉద్యోగం నుంచి తొలగించారు.

జయంతి ఉత్సవాల సమయంలో చేయని పనులకు ఇంజినీరింగు విభాగంలో కొందరు అధికారులు రూ.లక్షల్లో ఆలయ నిధులను స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయి. గతంలో పలు రకాల ఆర్జిత సేవలకు సంబంధించిన టికెట్లను కూడా రీఇష్యూ చేసిన సంఘటనలున్నాయి. కొండపైన జరిగే పలు టెండర్లలో నాయకులు, గుత్తేదార్లు కుమ్మక్కై అంజన్న సొమ్మును కాజేస్తున్నారు. ఆలయంలో జరుగుతున్న అక్రమ వసూళ్లపై పలుమార్లు భక్తులు అధికారులకు ఫిర్యాదు చేసినా సిబ్బంది తీరు మారడంలేదు. కొండగట్టులో ఇంటి దొంగల ఆటకట్టించి ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దాదాపు ఏడాది కిందట ఆలయ పాలకవర్గంలోని ప్రముఖ వ్యక్తి హుండీ లెక్కింపు సమయంలో బంగారు ఆభరణం తస్కరించినట్లు సీసీ కెమెరాలో నమోదు కావడంతో స్థానిక నాయకులు దేవాదాయశాఖ కమిషనరుకు ఫిర్యాదు చేయడంతో అతడిని పదవి నుంచి సస్పెండ్ చేసినప్పటికీ కోర్టు స్టే ఉత్తర్వుల ద్వారా కొనసాగుతున్నారు.

కఠిన చర్యలు - రామకృష్ణారావు, ఈవో

కొండగట్టు ఆలయంలో విధులు నిర్వహించే ఉద్యోగులు అక్రమాలు, అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు లోబడి ఉద్యోగులు పనిచేయాలి. అన్నదాన సత్రంలో బియ్యం, సరకులు మాయం చేసిన జూనియర్ సహాయకుడిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సస్పెన్షన్ కూడా చేస్తాం. కొండగట్టులో ఆయా విభాగాల సిబ్బంది పనితీరుపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది.

# అవార్డులు సరే... ప్రోత్సాహక నిధులేవి?



వేములవాడ: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆధునిక వైద్య సేవలందిస్తూ మంచి గుర్తింపు పొందింది. వైద్యులు కూడా వివిధ రకాల శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు రోజూ వచ్చే రోగుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. వీటన్నింటి ఫలితంగా వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి రాష్ట్ర స్థాయిలో మూడేళ్లుగా ప్రతిష్ఠాత్మక కాయకల్ప అవార్డును సొంతం చేసుకుంది. రాష్ట్రంలో దాదాపు వంద ఆసుపత్రులు ఉండగా మూడంచెల విధానంలో ఏటా ఈ అవార్డును సొంతం చేసుకోవడం గమనార్హం. అయితే ఈ అవార్డుకు సంబంధించిన నిధులు రాకపోవడం సిబ్బందిని నిరుత్సాహపరుస్తుంది. వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని ఆధునిక హంగులతో నిర్మించారు. వంద పడకలు ఉన్న ఈ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలతో రోగులకు వైద్య సేవలందిస్తున్నారు.

సాధారణ శస్త్రచికిత్సలతోపాటు నేత్ర, ఆర్థో, మోకీళ్ల మార్పిడి, కాన్పులు, గర్భ సంచిలో గడ్డల తొలగింపు తదితర శస్త్ర చికిత్సలు రోజూ జరుగుతుంటాయి.

సెప్టెంబరు 6న 24 గంటల్లో 23 వివిధ శస్త్ర చికిత్సలు నిర్వహించి ఆసుపత్రి వైద్యులు రికార్డు నెలకొల్పారు.

ఐపీ నెలకు దాదాపు 10 వేల వరకు ఉంటుంది. ఆసుపత్రి అభివృద్ధికి ఉపయోగపడతాయి

ఆసుపత్రి ఏటా కాయకల్ప అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. కానీ అవార్డుకు ప్రకటించిన ప్రోత్సాహక నిధులు మాత్రం రావడం లేదు. నిధులు విడుదలైతే ఆసుపత్రిలో అభివృద్ధి పనులకు ఉపయోగించేందుకు అవకాశం ఉంది.

- సంతోష్‌చారి, పర్యవేక్షకుడు, వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి

ఎంపిక విధానం ఇలా...

కాయకల్ప అవార్డు ఎంపికకు బృందం సభ్యులు మూడంచెల విధానంలో పరిశీలిస్తారు.

ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, పరిసరాల నిర్వహణ, పరిశుభ్రత, వ్యర్థాల సేకరణ, సిబ్బంది పని తీరు, విద్యుత్తు వినియోగం, పచ్చదనానికి ప్రాధాన్యం వంటి అంశాలను పరిశీలనకు తీసుకుని మార్కులు వేసి నివేదిక ఇస్తారు. ఈ నివేదిక ఆధారంగా అవార్డుకు ఎంపిక చేస్తారు.

వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని జులై 26న రాష్ట్ర బృందం తనిఖీ చేసింది. ఈ తనిఖీల్లో వచ్చిన మార్కుల ఆధారంగా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది.

అవార్డుకు ఎంపిక కావడంతో నగదు ప్రోత్సాహకం రూ.15 లక్షలు ప్రకటించింది.

మూడేళ్లుగా కాయకల్ప అవార్డుకు ఎంపికైనా ప్రభుత్వం ప్రకటించిన నిధులు మాత్రం రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

# పడకలు.. పరికరాలు.. ప్లాంటు ఎప్పుడో?

ధర్మపురి: ఓ వైపు ప్రముఖ పుణ్యక్షేత్రం, మరోవైపు నియోజకవర్గ కేంద్రం కావడంతో.. ప్రభుత్వం ధర్మపురిలో అత్యాధునిక వైద్య సేవలందించేందుకు ప్రాధాన్యత ఇస్తుంది. అయితే ఆసుపత్రిలోని సేవలపై నిఘా లేకపోవడంతో సిబ్బంది మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తనిఖీలు చేసినా.. మార్పు లేదు. ప్రభుత్వం మాతాశిశు కేంద్రం నిర్మించినా.. వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడంతో సేవలు అందుబాటులోకి రాలేదు.

20 మంది మాత్రమే విధుల్లో..

ఇక్కడి సామాజిక ఆసుపత్రిలో గతేడాది 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినా.. అత్యవసర సేవలు ఏమాత్రం ఉండటం లేదు. కుక్కకాటు, కోతులు దాడిచేసినా.. జగిత్యాల ఏరియా ఆసుపత్రికి వెళ్తున్నారు. కనీసం ఎక్స్‌రేప్లాంటు, గర్భిణుల పరీక్షలకు సంబంధించిన పరికరాలు లేవని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ వైద్యులతో కలిసి 53మంది పనిచేయాల్సి ఉండగా.. 20 మంది మాత్రమే విధుల్లో ఉంటున్నట్లు చెబుతున్నారు.

పనిచేయని ఆక్సిజన్ ప్లాంటు..

రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న ఆసుపత్రి మూడో అంతస్తు భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కరోనా సమయంలో సుమారు రూ.కోటి వ్యయంతో ఏర్పాటుచేసిన ఆక్సిజన్ ప్లాంటును గతేడాది ప్రారంభించినా.. సాంకేతిక లోపంతో పనిచేయడంలేదు. ఈ ఆసుపత్రి పరిధిలో ధర్మపురి, వెల్గటూర్, బుగ్గారం, బీర్‌పూర్ మండలాలుండగా.. నిత్యం 150 మంది ఓపీ రోగులు వస్తుంటారు. నేటికీ ప్రతిపాదనల్లోనే..గతేడాది 10 ఐసీయూ బెడ్ల ప్లాంటును ధర్మపురి ఆసుపత్రికి మంజూరు చేశారు. ఇది ప్రతిపాదనల్లోనే ఉంది. రోగులకు రోజూ అందించే భోజనం నాసిరకంగానే ఉంటోందని రోగులు వాపోతున్నారు. పారిశుద్ధ్యం కూడా అధ్వాన్నంగానే ఉంటోందని..



మధ్యాహ్నం వేళ వైద్యులు అందుబాటులో ఉండటంలేదని బాధితులు చెబుతున్నారు. ఆసుపత్రి సేవలపై ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అందని మాతాశిశు కేంద్రం సేవలు..ధర్మపురిలో గత ప్రభుత్వ హయాంలో రూ.8.50 కోట్లతో నిర్మించిన మాతాశిశు ఆసుపత్రి కేంద్ర భవన సేవలు అందుబాటులోకి రాలేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆదరబాదరాగా అక్టోబర్‌లో అప్పటి మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు. రెండు నెలల్లో మిగతా పనులు పూర్తిచేసి సేవలను అందుబాటులోకి తీసుకుని వస్తామని ప్రకటించినా.. ఇప్పటివరకు అతీగతి లేదు.ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం..ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలందించేందుకు కృషిచేస్తాం. ప్రస్తుతం వైద్యుల కొరత అంతగా లేదు. సిబ్బందిని కూడా నియమించాం. పరికరాల కోసం ప్రతిపాదనలు పంపించాం. వైద్యులు నిర్ణీత సమయం ప్రకారం ఉండేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఐసీయూ కేంద్రానికి కావాల్సిన పరికరాలు రావాల్సి ఉంది. మాతాశిశు ఆసుపత్రికి సిబ్బందిని నియమించలేదు. దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళుతాం.- డా.రామక్రిష్ణ, జిల్లా వైద్యవిధాన పరిషత్, సమన్వయకర్త

# కొందరిపైనే పని భారం!

సూర్యాపేట : జిల్లాలో గ్రామ పంచాయతీల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఇప్పటికే సర్పంచుల పదవీకాలం ముగిసింది. దీనికితోడు ఆగస్టులో పంచాయతీ కార్యదర్శుల బదిలీలు జరిగాయి. కొత్తవారికి ఆయా పంచాయతీలపై అవగాహన లేదు. ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నా.. పంచాయతీల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. కొన్ని గ్రామాలకు ఇన్‌ఛార్జి కార్యదర్శులు బాధ్యత వహిస్తున్నారు. వాటిల్లో పారిశుద్ధ్య, ఇతర సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇన్‌ఛార్జిల పాలన..జిల్లా వ్యాప్తంగా 475 గ్రామ పంచాయతీలున్నాయి. అన్నింటిలోనూ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో 180 మంది స్థాన చలనం కలిగింది. బదిలీల సమయంలో కొన్ని గ్రామ పంచాయతీలు ఎంపిక చేసుకునేందుకు అవకాశం కల్పించకపోవడంతో ఈ విషయమై అప్పుడే జిల్లా పాలనాధికారి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిష్కరించారు. అప్పటికే జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పంచాయతీలను ఎంపిక చేసుకున్నారు. కొందరికి ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ఇష్టం లేదు. కొందరు అనారోగ్యం,



ఇతర ఉద్యోగాలకు సిద్ధమయ్యేందుకు, ఇలా వివిధ కారణాలతో జిల్లాలో 62 మంది కార్యదర్శులు సెలవుపై వెళ్లారు. దీంతో పని చేస్తున్న వారిపైనే భారం పడుతోంది. అందులో దాదాపు 20 మంది వరకు పని చేసేందుకు ఆసక్తి ఉందని, ఆ స్థానం నుంచి వేరే ప్రాంతానికి బదిలీ చేస్తే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపినట్లు సమాచారం. అధికారులు స్పందించి బదిలీ చేస్తే పని ఒత్తిడి తగ్గుతుంది.

పాలనాధికారి చెప్పినా! పంచాయతీల్లో సెలవుల్లో ఉన్న ఉద్యోగుల వివరాలపై జిల్లా పాలనాధికారి ఇప్పటికే ఆరా తీసినట్లు సమాచారం. బదిలీలు అవసరమున్న వారికి వారు కోరుకునే స్థానాలకు వెళ్లేందుకు సుముఖంగా ఉన్న వారిని బదిలీ చేసేలా సన్నాహాలు చేయాలని సంబంధిత శాఖ అధికారికి నెల క్రితమే తెలియజేసినట్లు తెలిసింది. సదరు అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులకు నివేదిస్తాం: నారాయణరెడ్డి, డీపీవో, సూర్యాపేట


జిల్లాలో వివిధ కారణాలతో కార్యదర్శులు సెలవు పెట్టిన విషయం వాస్తవమే. కొందరు ఆయా గ్రామాలకు వెళ్లేందుకు సుముఖంగా లేని వారి వివరాలు తెలుసుకున్నాం. వారి బదిలీ విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల వివరాలు

మొత్తం కార్యదర్శులు : 475 ఓపీఎస్‌లు : 51 గ్రేడ్-2 : 288 జేపీఎస్ : 136 సెలవుల్లో ఉన్న వారు: 62 బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న వారు : 24

# కొత్త ఉపాధ్యాయులు వస్తున్నారు..!

నల్గొండ : సర్కారు బడులకు కొత్త ఉపాధ్యాయులు వచ్చి పాఠం చెప్పనున్నారు. డీఎస్సీ-2024 ద్వారా ఉపాధ్యాయ కొలువులకు ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో ఉత్తర్వులు అందుకున్న అభ్యర్థులకు కౌన్సెలింగ్ ద్వారా పాఠశాల కేటాయించనున్నారు. కొత్తవారి రాక సర్కారు బడుల్లో కొంత మేర ఉపాధ్యాయుల కొరత తీరనుంది. నల్గొండ జిల్లాలో 605, సూర్యాపేట జిల్లాలో 386, యాదాద్రి భువనగిరి జిల్లాలో 277 ఖాళీలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీచేసింది. ఫలితాలు వెలువడిన తర్వాత ధ్రువపత్రాలు పరిశీలించి 1:1 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేశారు. వీరికి హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. దసరాకు ముందు కొలువుల ఉత్తర్వులు పొందినా ఎక్కడ పోస్టింగ్ అనే విషయం కొలిక్కిరాలేదు. పోస్టింగ్ కోసం జిల్లా విద్యాశాఖ మంగళవారం



ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించనుంది.

ప్రాథమిక పాఠశాలలకు ఊరట ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలకు కాస్త ఊరట కలగనుంది. ఇటీవల పదోన్నతులు, బదిలీలు చేపట్టిన తరువాత ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీల కొరత కాస్త ఎక్కువగా ఉంది. బదిలీ జరిగిందని సంతోషం ఉన్నా అక్కడ ఉపాధ్యాయులు లేక కొన్నిచోట్ల రిలీవర్‌లు లేక అదే స్థానంలో కొనసాగుతున్నారు. తాజాగా కొత్త ఉపాధ్యాయుల నియామకం అవుతుండటంతో అలాంటి వారికి కాస్త ఉపశమనం కలుగనుంది.

అభ్యర్థులందరూ హాజరుకావాలి : భిక్షపతి, డీఈవో, నల్గొండ

డీఎస్సీ-2024లో ఎంపికయి, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో రిపోర్టు చేసిన అభ్యర్థులందరికీ ఈ నెల 15న (మంగళవారం) ఉదయం 10 గంటల నుంచి నల్గొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. అభ్యర్థులందరూ రెండు తాజా పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, వాస్తవ ధ్రువపత్రాలతో హాజరుకావాలి. బదిలీ అయిన ఉపాధ్యాయులు కొంత మంది అదే పాఠశాలలో కొనసాగుతూ విధులు నిర్వహిస్తున్నారు. వారు మంగళవారం సాయంత్రం విధుల నుంచి విడుదలై 16వ తేదీన బదిలీ స్థానంలో రిపోర్టు చేయాలి.

# ఇళ్లలోకి వరద.. బాధితుల కన్నీరు

గంగాధర: గంగాధర మండలం మధురానగర్‌లోని 9వ వార్డులో అయిదేళ్లుగా వర్షాకాలంలో వరదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఇళ్ల సమీపంలోనే ఉన్న కుడి కాలువ తెగి వరద ఇళ్లలోకి, వీధుల్లోకి చేరుతుండగా ఆందోళనకు గురవుతున్నారు. ఏటా ఇబ్బందులు పడుతున్నా సాగునీటి పారుదల శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఆవేదన చెందారు. ఇళ్లకు సమీపంలోనే నారాయణపూర్ జలాశయం నుంచి వేములవాడకు కుడికాలువ నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. వర్షాలు కురిసిన ప్రతిసారి దగ్గర్లోనే ఉన్న వంటశాల గుట్ట నుంచి వరద వచ్చి కుడికాలువలో చేరుతుంది. అసంపూర్తి కాలువలో నీటి నిల్వ పెరిగి కట్ట తెగడంతో నీరంతా ఇళ్లలోకి, దారుల్లోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 50 ఇళ్లలోకి వరద చేరి సరుకులు తడిసిముద్దవుతున్నాయని వాపోయారు.

వర్షాలు తగ్గుముఖం పట్టినా వరద మాత్రం ఇప్పటికీ ప్రవహిస్తుందని మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. పాములు, తేళ్లు, విషకీటకాలతో భయాందోళనకు గురవుతున్నామని తెలిపారు. కాలువలోని బండరాళ్లు తొలగించి సమస్య పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని మాజీ సర్పంచి వేముల లావణ్య తెలిపారు. ఎంపీడీవో జనార్దన్‌రెడ్డిని స్థానికులు కలిసి సమస్య పరిష్కరించాలని మొర పెట్టుకున్నారు. అధికారులు స్పందించి కాలువ నీరు ఇళ్లలోకి




రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏటా ఇబ్బందులు...అయిదేళ్లుగా వర్షాకాలంలో ఇళ్లలోకి నీరు వచ్చి చేరుతుంది. సరకులన్నీ తడిసిముద్దవుతున్నాయి. పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలు వృద్ధి చెందుతున్నాయి. జ్వరాల బారిన పడుతున్నాం. వీధుల్లో నడిచివెళ్లాలంటే పిల్లలు, వృద్ధులు జంకుతున్నారు.

మానస

అధికారులు పట్టించుకోవడం లేదు

నాలుగు రోజులైనా వరద ప్రవహిస్తూనే ఉంది. మురుగునీటి కాలువలు లేక వీధుల్లోకి, ఇళ్లలోకి చేరుతుంది. కాలువ అసంపూర్తిగా వదిలేయడంతో కట్ట తెగి నీరు ప్రవహిస్తోంది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా దాటవేస్తున్నారు. తప్ప సమస్య పరిష్కరించడం లేదు.

మల్లేశం

ముంపు సమస్యకు పరిష్కారం ఎలా?

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ఏటా వర్షాకాలంలో కొన్ని ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. ఏళ్ల తరబడి ఈ సమస్య నెలకొని ఉండగా శాఖల మధ్య సమన్వయ లోపం, నిధుల కొరత కారణంగా నగరవాసులు అవస్థలు పడుతున్నారు. నగరవ్యాప్తంగా ఏడు ప్రాంతాల్లో నీరు నిలుస్తోందని బల్దియా ఇంజినీరింగ్ విభాగం అధికారులు గుర్తించి కమిషనర్‌కు నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ప్రధానంగా హౌసింగ్‌బోర్డుకాలనీ, ఎన్టీఆర్ విగ్రహం కూడలి, ఆర్టీసీ వర్క్‌షాప్, రాంనగర్, మకరంపుర ఏరోప్లేన్ వీధి, శ్రీనగర్‌కాలనీ, హుస్సేనీపుర తదితర ప్రాంతాలు ఉన్నాయి. హౌసింగ్‌బోర్డుకాలనీలో రెండేళ్లుగా కొన్ని ఇళ్లలోకి వరద వస్తోంది. ఎగువ నుంచి వచ్చే వరద వెనక్కి వస్తుండటంతో ఆ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. రామగుండం బైపాసు రోడ్డులో బొమ్మకల్ పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారిపై మూడు కల్వర్టులు ఉన్నాయి. వీటిని మూసివేయడంతో నీరంతా నిలిచిపోతోంది. వీటిని తెరిచి వరదను మానేరులో కలిసేలా చర్యలు చేపడితే తప్ప ఫలితం ఉండదు.

# నష్టం అంచనా

జగిత్యాల: జిల్లాలో కురిసిన వర్షాల కారణంగా జరిగిన నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు 38.40 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు దెబ్బతినగా రెండు పక్కా ఇళ్లు పాక్షికంగా.. 3 కచ్చా ఇళ్లు పూర్తిగా.. 34 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఒక పశువు మృతి చెందగా 6 కిలోమీటర్ల మేర రహదారులు.. 2 వంతెనలు.. 4 కల్వర్టులు.. 5 ట్యాంకులు దెబ్బతిన్నాయి. వరద బాధితుల కోసం 14 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయగా 585 మందిని తరలించారు. జగిత్యాల మండలం చల్‌గల్ పెద్దచెరువు, కల్లెడ పోచమ్మకుంట, తుమ్మలకుంటకు బుంగలు పడగా తాత్కాలికంగా మరమ్మతులు చేశారు.

తాత్కాలిక మరమ్మతులపై దృష్టి

సారంగాపూర్ మండలం అర్పపల్లి డి-53 కాలువ డ్రాప్ గోడ పడిపోగా జగిత్యాల మండలం వెల్దుర్తితో కాలువకు బుంగపడింది. బీమారం



మండలం ఒడ్యాడ్ హెూల్‌కమ్మకుంట, పసునూరు ఊరకుంట దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతుల కోసం రూ.1.12 కోట్లు అంచనా వేశారు. కాగా పెగడపల్లి మండలం మద్దులపల్లి, పందులగుట్ట రహదారిపై కల్వర్టులు దెబ్బతినగా, కథలాపూర్ మండలం తుర్తి - రుద్రంగి రహదారి, కల్వర్టులకు గండ్లు పడ్డాయి. రాయికల్ మండలం ఆదర్శ పాఠశాల రహదారితోపాటు కొడిమ్యాల మండలం సూరంపేట రహదారిపై కల్వర్టుకు గండి పడింది. మేడిపల్లి మండలం కొండాపూర్-ఒడ్యాడ్ రహదారిపైజ.. ఎండపల్లి మండలం కొత్తపేట ఎస్సీ కాలనీ.. కొడిమ్యాల మండలం కోనాపూర్ రహదారి.. సూరంపేట గంగారాం తండా రహదారిపై.. కథలాపూర్ మండలం పోతారం తండా రహదారిపై కల్వర్టులు తెగిపోయాయి. జగిత్యాల మండలం గుల్లపేట శ్మశానవాటికకు వెళ్లే రహదారిపై గండి పడింది. మల్లాపూర్ మండలం మొగిలిపేట రహదారిపై కల్వర్టు తెగిపోయింది. తాత్కాలిక మరమ్మతులకు రూ.11.5 లక్షలు అవసరమని అధికారులు గుర్తించారు.

# భూదాన్ భూములు.. మింగేస్తున్నారు!



పెద్దేముల్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం 'భూదాన్ భూములు' అమ్మకూడదు, కొనకూడదు. కానీ కొందరు అక్రమార్కులు అవేమీ పట్టించుకోవడం లేదు. గిరిజనులకు ప్రభుత్వం పంచిన భూములను కారుచౌకగా కొనుగోలు చేస్తున్నారు. ఎకరం రూ.80,000 చొప్పున ధర నిర్ణయించి ముందుగా కొంత ముట్టజెప్పుతున్నారు. రైతుల వద్ద ఒప్పందాలు చేసుకుని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యూ యంత్రాంగం మాత్రం అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. పెద్దేముల్ మండల కేంద్రంలో 'చాపకింద నీరులా' సాగుతున్న ఈ తతంగం గురించి ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. దీనికి సంబంధించి కథనం.

**మొత్తం 75.19 ఎకరాలు**

మండల కేంద్రం పెద్దేముల్ గ్రామ రెవెన్యూ శివారులో మొత్తం 75.19 ఎకరాల విస్తీర్ణంలో భూదాన్ భూములున్నాయి. 1954 వరకు పట్టా భూములుగా ఉన్నాయి. 1958లో కొందరు స్థానిక భూస్వాములు ప్రభుత్వానికి దానం చేశారు. వాటినే 'భూదాన్ భూములుగా' పేర్కొంటూ ఎలాంటి భూమి లేని గిరిజనులకు ప్రభుత్వం పంచి పెట్టింది.

**6.22 ఎకరాలకు అక్రమంగా పట్టాలు**

భూదాన్ చట్టం 1965 ప్రకారం కేటాయించిన వ్యక్తి సాగు కోసం భూమిని ఉపయోగించాలి. ఎలాంటి లావాదేవీలు చేయకూడదు. అయినా రైతులతో ఒప్పందాలు చేసుకున్న స్థిరాస్తి వ్యాపారులు భూములను ఆక్రమించారు. ధరణి పోర్టల్ రాకముందే కొంత మంది గిరిజనుల భూములు అక్రమంగా పట్టా అయ్యాయి. 2014లో 6.22 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పేరు మార్పిడి చేసుకుని పట్టా భూమిగా మార్చుకున్నారు. తర్వాత ధరణి రావడంతో మిగిలిన రైతుల భూముల్లో మార్పు జరగలేదు. 2015లో ప్రభుత్వం భూదాన్ బోర్డును రద్దు చేసింది. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి ఈ భూములకు ప్రత్యేక అధికారిగా కొనసాగుతున్నారు.

**లీజుల పేరుతో ఒప్పందాలు**

సాగుకు అనువుగా లేవని కొందరు గిరిజనులు పడావుగా వదిలేశారు. ఇదే అదనుగా నగరానికి చెందిన వ్యాపారులు మధ్యవర్తుల ద్వారా భూముల కొనుగోళ్లు చేపట్టారు. 2014లో ఈ తంతుకు శ్రీకారం చుడితే ఇటీవలి కాలంలో అక్రమ మార్గంలో కొందరి భూములను పట్టాగా మార్చుకుని మార్పిడి చేసుకుంటున్నారు. రైతులకు డబ్బులు చెల్లించిన కొందరు వ్యాపారులు తమ పేరు మీద భూములు పట్టా కావని తెలిసి 99 సంవత్సరాల పాటు లీజుకు ఇచ్చినట్లు రైతులతో రాయించుకుంటున్నారు. పాత ఒప్పందాలను పక్కన బెట్టి కొత్తగా లీజుకు తీసుకుంటున్నట్లు ఒప్పందాలు చేసుకుంటున్నారు.

**విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం**

కిషన్, తహసీల్దార్, పెద్దేముల్

భూదాన్ భూములు అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరం. అవి ప్రభుత్వ భూములు. 2022 నుంచి నిషేధిత జాబితాలో ఉన్నాయి. లావాదేవీలు జరిపితే చర్యలు తీసుకుంటాం. పట్టా మార్పిడి జరిగిన భూములపై క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

# పార్కుల స్థలాలు మాయం!




హైదరాబాద్: గతంలో హెచ్‌ఎండీఏ పరిధిలో అనుమతించిన లేఅవుట్లలో పార్కులు, ఇతర ప్రజాఅవసరాలకు కేటాయించిన స్థలాల మాయంపై ప్రస్తుతం చర్చ నడుస్తోంది. చెరువులకు ఉన్న ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోని అక్రమ కట్టడాలను హైడ్రా అధికారులు కూల్చివేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆక్రమణలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకునే అవకాశముండటంతో అధికార యంత్రాంగంలో దడ మొదలైంది. తర్వాత పార్కుల్లో ఉన్న అక్రమ నిర్మాణాలపై హైడ్రా దృష్టిసారించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. గతంలో లేఅవుట్లలో పార్కులు, ఆట స్థలాలు ఇతర ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాలను సైతం దొంగ సర్వేనంబర్లతో కొందరు కబ్జాచేశారు. వాటిని కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్లు సృష్టించి అక్కడ భారీగా నిర్మాణాలు చేపట్టారు. కొందరు షెడ్లు వేసి తమ అధీనంలో పెట్టుకున్నారు. ఫంక్షన్ హాళ్లు లాంటివి నిర్మించి అద్దెకు ఇచ్చి అక్రమంగా సంపాదిస్తున్నారు. అవుటర్ రింగ్ రోడ్డు పరిధిలోని పలు పెద్దపెద్ద వెంచర్లకు గతంలో హెచ్‌ఎండీఏ అనుమతులు జారీ చేసింది. తర్వాత కాలంలో అక్కడ స్థలాలకు భారీ ఎత్తున ధరలు వచ్చాయి. కొన్ని చోట్ల చదరపు గజం రూ.లక్షపైనే పలుకుతోంది. (నార్సింగ్, నానక్‌రాంగూడ, మణికొండ ప్రాంతాల్లో కొన్ని లేఅవుట్లలో పార్కుల కోసం విడిచిపెట్టిన భూములను ఆయా లేఅవుట్లలోని నేతలే తప్పుడు డ్యాక్యుమెంట్లతో మింగేసినట్లు ఆరోపణలున్నాయి.)

జరుగుతోంది ఇలా..

చాలా లేఅవుట్లలో పార్కులు, ఆట స్థలాలను నామమాత్రంగా చూపుతూ సరిపెడుతున్నారు. అక్కడితో ఆగకుండా ప్రజా అవసరాలకు కేటాయించిన 10 శాతం భూమిపై దృష్టిపెడుతున్నారు. 4-5 శాతం స్థలం వదిలి మిగతా భూమిని ఏదోలా మళ్లీ సొంతం చేసుకుంటున్నారు. లేఅవుట్లలో ప్లాట్లు కొన్నవారికి అవగాహన లేకపోవడం, దీనిపై సరైన సమాచారం లేక ఇలాంటి అక్రమాలపై ప్రశ్నించే వారు కనిపించకపోవడంతో వారు ఆడిందే ఆటగా పాడిందే పాటగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో పార్కులు, ఆట స్థలాల కబ్జాపై అతి త్వరలో హైడ్రా దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. చెరువుల్లో కబ్జాల తొలగింపు తర్వాత పార్కుల ఆక్రమణలపై కొరడా ఝళిపించే అవకాశం ఉంది. ఈ లోపు ఆక్రమణలపై పూర్తి సమాచారం సేకరిస్తున్నట్లు హెచ్‌ఎండీఏకు చెందిన ఓ అధికారి తెలిపారు.

ఇదీ పద్ధతి..లేఅవుట్లు వేసే సందర్భంలో అన్ని వైపులా అంతర్గత రహదారులు నిర్మించాలి. ప్రధాన రహదారికి వీటిని అనుసంధానం చేయాలి. ఉద్యానాలు, ఆట స్థలాలు, పచ్చదనం పెంపొందించేందుకు కూడా లేఅవుట్లలో 10 శాతం స్థలం విడిచిపెట్టాలి. లేఅవుట్ అభివృద్ధి చేసే సమయంలో ఇక్కడ పార్కులు, ఆట స్థలాలను తీర్చిదిద్దాలి. అప్పుడే తుది లేఅవుట్ అనుమతులను హెచ్‌ఎండీఏ జారీ చేస్తుంది. అప్పటివరకు తన తనఖాలో ఉంచుకుంటుంది.

# వ్యాధుల ముప్పు.. ముందే మేల్కొంటే మేలు

సిరిసిల్ల : భారీ వర్షాల కారణంగా జిల్లా కేంద్రంలో పలు ప్రాంతాలను వరద ముంచెత్తింది. దీంతో పారిశుద్ధ్య సమస్య నెలకొంది. మరోవైపు అంతర్గత రహదారులపై బురద నిలిచింది. వెంటనే పరిశుభ్రతకు చర్యలు చేపట్టకపోతే వ్యాధులు ప్రబలే అవకాశం లేకపోలేదు. ఆ దిశగా పురపాలక యంత్రాంగం కదలాల్సిన అవసరం ఉంది.

సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్, శ్రీనగర్ కాలనీల్లో అంతర్గత రహదారులు వరదలకు కొట్టుకుపోయాయి. శాంతినగర్ నుంచి శ్రీనగర్‌కు వచ్చే రోడ్డు పక్కనే వరద నిలిచి కాలనీవాసులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. నీటిలో నుంచే కాలనీవాసులు రాకపోకలు సాగిస్తున్నారు. మురుగులో నడవడం వల్ల కాళ్లు చెడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కాలువలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది.

అంతర్గత వీధుల్లో కాలువలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో వర్షాలు వస్తే మురుగంతా రహదారులపై నుంచే పారుతోంది.

వార్డుల్లో కాలువలను శుభ్రం చేయాలని, ప్రధాన కాలువల వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లాలని పురపాలక సంఘం అధికారులకు స్థానికులు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించడం సాధారణమే అయినప్పటికీ దీనికి ప్రధాన కారణం పారిశుద్ధ్య లోపం. కాలువలు నిండి వ్యర్థాలు రోడ్లపైకి చేరడంతోపాటు చెత్తాచెదారం కుళ్లిపోయి ఈగలు, దోమలు వృద్ధి చెందుతాయి. ఇవే వ్యాధులకు ప్రధాన కారణమవుతాయి.

అధికారుల నిర్లక్ష్యం వల్ల చెత్తాచెదారం ఎక్కడికక్కడే పేరుకుపోతోంది. ఎప్పటికప్పుడు కాలువలను శుభ్రం చేయిస్తే ఈ సమస్య ఉండదు. అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. అలాగే అంతర్గత రహదారులపై నిలిచిన బురదను తొలగించాలని శాంతినగర్, శ్రీనగర్ కాలనీవాసులు కోరుతున్నారు.

చెప్పినా పట్టించుకోవడం లేదు



వర్షాకాలం వచ్చిందంటే చాలు నీరు ఇళ్లలోకి వస్తుంది. ఇళ్ల మధ్యనే మురుగు నిల్వ ఉంటుంది. కాలువలు సరిగ్గా లేకపోవడంతో రహదారులపై నీరు నిలిచి ఇబ్బంది కలుగుతుంది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.

తడిగొప్పుల వజ్రవ్వ, శాంతినగర్

నీళ్లలో నుంచి నడిస్తే...

వర్షానికి రోడ్డుపై మురుగు చేరడంతో ఇళ్లలోకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ఇంటికి వెళ్లాలంటే మురుగులో నుంచే వెళ్లాలి. రోజూ రావడం, పోవడం వల్ల కాళ్లు చెడిపోతున్నాయి. మట్టి పోయాలని మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశాం. వచ్చి చూసి వెళ్లారే తప్ప ఇప్పటి వరకు మట్టి పోయలేదు.

జిందం విజయ

దోమలు వస్తున్నాయి

ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. వర్షానికి అందులో మురుగు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయి. నీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లాలి.

చెల్లోజి రమేశ్శుభ్రం చేయిస్తాం

సమస్య మా దృష్టికి వచ్చింది. రెండు రోజుల్లో అంతర్గత రోడ్లపై మట్టి పోయిస్తాం. మురుగు కాలువలను శుభ్రం చేయిస్తాం.

సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిరిసిల్ల పురపాలక సంఘం

# వసతి కొరత.. విద్యార్థుల వేదన

నిర్మల్ : జిల్లా ఖానాపూర్‌కు చెందిన స్వాతి.. కరీంనగర్‌లోని ఓ డిగ్రీ కళాశాలలో చేరారు. పోస్ట్‌మెట్రిక్ బీసీ వసతిగృహంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోగా.. ప్రవేశాలు లేవని నిర్వాహకులు చెప్పారు. ఆర్థిక స్తోమత లేకపోవడంతో అందులో చేరేందుకు రెండు వారాలుగా అధికారులకు వినతిపత్రం అందజేస్తున్నారు.

కొత్తపల్లి మండలం ఎలగందల్‌కు చెందిన నిలేశ్ కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశం పొందాడు. బీసీ వసతిగృహంలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోగా.. వాటిల్లో సీటు లభించడం లేదు. 15 రోజులుగా అంతగా బస్సు సౌకర్యం లేని గ్రామం నుంచి తరగతులకు హాజరయ్యేందుకు ఇబ్బందులు పడుతున్నాడు.

వీరే కాదు.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు పక్క జిల్లాల నుంచి కరీంనగర్‌లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వస్తున్న పలువురు విద్యార్థుల దుస్థితి ఇది. అటానమస్ గుర్తింపు పొందిన ఎస్సారార్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలతోపాటు ఇతర వాటిలో ఇక్కడ చదివేందుకు పలు ప్రాంతాల బీసీ విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. వారు కోరుకున్న కళాశాలల్లో సీట్లు సాధిస్తున్నా.. వసతిగృహాల్లో ప్రవేశాలు లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు.

అద్దె భవనాల్లో..కరీంనగర్ జిల్లాలో మొత్తం 11 పోస్టు మెట్రిక్ బీసీ వసతిగృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఒక్కోదాంట్లో 150 మందికి మాత్రమే ప్రవేశాలు కల్పిస్తున్నారు. అయినా ఇందులో చేరేందుకు అధిక మంది ఆసక్తి చూపుతన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా, నిర్మల్, ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల విద్యార్థులు సైతం ఇక్కడి కళాశాలల్లో చేరుతున్నారు.

ముందుగా వచ్చిన వారితోనే ప్రవేశాలు పూర్తవుతున్నాయి. మిగిలిన వారు వసతి కోసం సంబంధిత అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరికొందరు ప్రైవేటు వసతిగృహాలను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడి ఒక వసతిగృహానికే 340 మంది బాలికలు దరఖాస్తు పెట్టుకున్నా



రంటే ఎంత ఆవశ్యకత ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి బాలికలు ఈ పరిస్థితితో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. భోజన, వసతి లేమి కారణంగా మధ్యలో కళాశాలలను వదిలి వెళ్లలేక.. ఇబ్బందుల మధ్యే చదువు కొనసాగిస్తున్నారు. కరీంనగర్ ఎస్సీ పోస్ట్ మెట్రిక్ బాలుర వసతిగృహాల్లోనూ ఇదే పరిస్థితి.

సమస్యను పరిష్కరించాలి

మారుమూల ప్రాంత పేద విద్యార్థులు కరీంనగర్‌లో చదువుకునేందుకు ఎక్కువగా వస్తున్నారు. ఇక్కడి వసతి గృహాల సంఖ్యను ప్రభుత్వం పెంచని కారణంగా అనేకమంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం వెంటనే స్పందించాలి. కె.శ్రీధర్ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీసీ సంక్షేమ సంఘంప్రభుత్వానికి విన్నవించాంకళాశాల విద్యార్థులు చేరే వసతిగృహాల్లో ప్రవేశాలు భర్తీ అయ్యాయి. చాలామంది దరఖాస్తు పెట్టుకుంటున్నారు. అదనపు ప్రవేశాల కోసం ప్రభుత్వానికి విన్నవించాం. అనుమతి రాగానే చేరేందుకు అవకాశం కల్పిస్తాం.

అనిల్ ప్రకాశ్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి

# వరదొస్తే.. దారి వెతుక్కోవాల్సిందే

సిరిసిల్ల : జిల్లా వ్యాప్తంగా రెండ్రోజులుగా కురిసిన వర్షాలకు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖల రహదారులు అధ్వానంగా మారాయి. పలు చోట్ల గుంతలు పడటంతో పాటు కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. ఆయా మార్గాల్లో అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. జిల్లాలో కోనరావుపేట, ఇల్లంతకుంట, బోయినపల్లి మండలాల్లో దెబ్బతిన్న రహదారుల గుండా ప్రయాణం ఇబ్బందిగా మారడంతో ప్రత్యామ్నాయ మార్గాల్లో పట్టణాలకు వెళ్తున్నారు. రహదారులు మరమ్మతులు చేపట్టడానికి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.సిరిసిల్ల-మరిమడ్ల రహదారిలో లచ్చపేట వద్ద వంతెన ప్రాంతంలో రహదారి కోతకు గురైంది. కోనరావుపేట మండలం మామిడిపల్లి-నిజామాబాద్, నిమ్మపల్లి-వట్టిమల్ల రహదారుల్లో మూలవాగుపై తాత్కాలిక రహదారులు పూర్తిగా కోతకు గురయ్యాయి.



ఆయా మార్గాల్లో వెళ్లే వారు సమీప గ్రామాలు లింగంపల్లి, మంగళపల్లి, సుద్దాల, మారుపాక, నందికమాన్ మీదుగా వేములవాడకు వెళ్తున్నారు.

వేములవాడ మండలం హన్మాజీపేట-బావుసాయిపేట, వేములవాడ-సిరికొండ మార్గాల్లో కాజ్‌వేలు కోతకు గురయ్యాయి. వేములవాడ-కోరుట్ల రహదారిలో చందుర్తి మండలం సనుగుల వద్ద రెండు చోట్ల రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. వేములవాడ పట్టణ శివారు బీరప్ప ఆలయం సమీపంలో మల్లారం రహదారిలో లోలెవల్ కాజ్‌వే శిథిలావస్థకు చేరింది.

మాచారెడ్డి-ముస్తాబాద్-సిద్దిపేట రహదారిలో కాజ్‌వే ప్రమాదకరంగా ఉంది. పెద్దమ్మస్టేజి - లింగన్నపేట రహదారిలో పైవంతెన నిర్మాణ ప్రాంతంలో తాత్కాలిక రహదారి మానేరు వరద ఉద్ధృతికి నామరూపాల్లేకుండా కొట్టుకుపోయింది. అలాగే ఇల్లంతకుంట మండలం జవారిపేట-నర్సక్కపేట మధ్యలో వరద తాకిడికి కాజ్‌వే పైపులతో సహా కొట్టుకుపోయింది. అధికారులు ఈ మార్గాల్లో రాకపోకలను దారి మళ్లించారు.బోయినపల్లి-వేములవాడ, రుద్రంగి-దసరానాయక్‌తండా, ఇల్లంతకుంట మండలం తాళ్లపల్లి-గూడెం గ్రామాల మధ్య రహదారులు కోతకు గురికావడంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.



# విశాఖ, కాకినాడ తీరాల్లో ఎగసిపడుతున్న అలలు..

వాయుగుండం ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాయలసీమ జిల్లాలతో పాటు ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, తూర్పుగోదావరి, విశాఖ జిల్లాల్లో కొన్నిచోట్ల జనజీవనం స్తంభించింది. విశాఖపట్నం, కాకినాడ తీరాల్లో పెద్ద ఎత్తున సముద్రపు అలలు ఎగసిపడుతున్నాయి. విశాఖలోని ఆర్కే బీచ్ వద్ద అలలు దుకాణాలను తాకుతున్నాయి. వర్షానికి పెదగంట్యాడ మండలం కొంగపాలెంలో రేకుల షెడ్డు కూలింది. దీంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. కాకినాడ జిల్లాలోని యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. భారీగా రాకాసి అలలు ఎగసిపడుతున్నాయి. చెట్లు, విద్యుత్, స్తంభాలు, ఇళ్లు నేల కూలాయి. అంతర్వేది తీరంలో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. గోదావరి సంగమం వద్ద అలలు ఎగసిపడుతున్నాయి. పల్లిపాలెంలో ఇళ్లు, బీచ్ రోడ్డును అలలు ముంచెత్తాయి. డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అల్లవరం మండలం ఓడలరేవు తీరంలో అలలు ఉద్ధృతంగా ఎగసిపడుతున్నాయి. ఓఎన్‌జీసీ ప్లాంటును సముద్రపు నీరు తాకింది. ఆక్వా చెరువులను సముద్రం నీరు ముంచెత్తింది.

**తడ వద్ద తీరం దాటిన వాయుగుండం :** తిరుపతి జిల్లా తడ వద్ద వాయుగుండం తీరాన్ని దాటినట్లు వాతావరణశాఖ వెల్లడించింది. గడిచిన 6 గంటలుగా 22 కి.మీ వేగంతో కదిలి తీరాన్ని తాకినట్లు తెలిపింది. అనంతరం అల్పపీడనంగా బలహీనపడింది. ఈ ప్రభావంతో రాష్ట్రంలోని పలు తీర ప్రాంత, రాయలసీమ జిల్లాలతో పాటు ఉత్తర తమిళనాడులో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

**జలాశయాలకు చేరుతున్న వరద :** శ్రీసత్యసాయి జిల్లా సి.కె.పల్లి మండలం వెల్దుర్తి సమీపంలో చిత్రావతి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వెల్దుర్తి, గంగినేపల్లి తండాలకు, ఎర్రోనిపల్లి, బ్రాహ్మణపల్లి, చిన్నప్పరెడ్డిపల్లి గ్రామాలకు రాకపోకలకు నిలిచిపోయాయి. వైఎస్సార్ జిల్లాలో గండికోట జలాశయం, మైలవరం జలాశయాలకు వరద నీరు వచ్చి చేరతోంది. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిండుకుండలా మారింది. పైడిపాలెం, వామికొండ, సర్వారాయ సాగర్ జలాశయాలకు వరద వచ్చి చేరుతోంది. నెల్లూరు నగర శివారులోని ఆటోనగర్, చంద్రబాబు నగర్, తల్పగిరి కాలనీ, జొన్నవాడ రోడ్డు, పొట్టేపాలెం కలుజు ప్రాంతాల్లో వర్షం కారణంగా రహదారులపై నీరు నిలిచింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బుధవారం రాత్రి వర్షానికి పంట తడిసింది. ఆరబోసిన మొక్కజొన్న, వేరు శనగ తడిసి రైతులకు నష్టం వాటిల్లింది. పలుచోట్ల వరి నీటమునిగింది.



# ఏపీ సీఎస్‌కు నలుగురు ఐఏఎస్‌ల రిపోర్టు

అమరావతి : డీవోపీటీ ఆదేశాల మేరకు నలుగురు ఐఏఎస్ అధికారులు గురువారం ఏపీలో రిపోర్టు చేశారు. తెలంగాణ హైకోర్టు డీవోపీటీ ఆదేశాలపై జోక్యం చేసుకునేందుకు నిరాకరించడంతో తెలంగాణ నుంచి రిలీవ్ అయిన ఆమ్రపాలి కాట, రోనాల్డ్ రోస్, వాణీ ప్రసాద్ , వాకాటి కరుణ ఏపీ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్‌ను కలిసి రిపోర్టు చేశారు. మరోవైపు ఏపీ నుంచి రిలీవ్ అయిన ఐఏఎస్ అధికారులు సృజన, హరికిరణ్, శివశంకర్‌లు బుధవారమే హైదరాబాద్‌కు వచ్చి సీఎస్ శాంతికుమారికి రిపోర్టు చేశారు. కేంద్రం ఈనెల 9న ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఆలిండియా సర్వీసు అధికారులు తమకు కేటాయించిన రాష్ట్రాల్లో చేరాల్సిందేనంటూ కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఈ ఉత్తర్వులు ఆపాలని కోరుతూ తెలంగాణలో పనిచేస్తున్న ఐఏఎస్‌లు హైకోర్టుకు వెళ్లారు. క్యాట్ ఇచ్చిన ఉత్వర్వుల్లో జోక్యం చేసుకోబోమని హైకోర్టు తేల్చిచెప్పడంతో ఆమ్రపాలి కాట, రోనాల్డ్ రోస్, వాణీ ప్రసాద్, వాకాటి కరుణ ఏపీకి వెళ్లి సీఎస్‌కు రిపోర్టు చేశారు.

# తెదేపా కార్యాలయంపై దాడి కేసు.. విచారణకు హాజరైన సజ్జల రామకృష్ణారెడ్డి



మంగళగిరి: వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో విచారించాలని మంగళగిరి పోలీసులు నోటీసులు జారీ చేయడంతో ఆయన ఇవాళ విచారణకు హాజరయ్యారు. సజ్జల వెంట న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున తదితరులు ఉన్నారు. సజ్జలతో పాటు విచారణాధికారి వద్దకు తనను కూడా అనుమతించాలని పొన్నవోలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వేలు చూపించి మరీ పోలీసులను బెదిరించారు. అయితే, విచారణ సమయంలో న్యాయవాదులను పోలీసులు అనుమతించలేదు. దీనికి కోర్టు అనుమతి తప్పనిసరి అని, ప్రస్తుతం విచారణకు సజ్జలను మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. దీంతో సజ్జల ఒక్కరే పోలీస్‌స్టేషన్ లోకి వెళ్లారు. మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ, గ్రామీణ సీఐ శ్రీనివాసరావు విచారిస్తున్నారు.

**నిందితులకూ హక్కులు ఉన్నాయి: పొన్నవోలు –** సజ్జల రామకృష్ణారెడ్డికి న్యాయస్థానం ఈనెల 24 వరకు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తే 10న లుక్‌ఔట్ నోటీసులు ఎలా ఇస్తారని న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. దాడి జరిగిన రోజు సజ్జల మంగళగిరికి 500 కి.మీ దూరంలో ఉన్నట్టు కోర్టుకు ఆధారాలు కూడా సమర్పించామన్నారు. పోలీసులకు విచారించే అధికారం ఉన్నట్టు.. నిందితులకూ హక్కులు ఉన్నాయన్నారు. తెదేపా కార్యాలయంపై దాడి కేసును రకరకాలుగా తిప్పుతున్నారని, దీనిపై న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. వైకాపా అధికారంలో ఉండగా 2021 అక్టోబర్ 19న ఆ పార్టీకి చెందిన మూకలు తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడికి పాల్పడ్డాయి. దీనిపై కేసు నమోదు కావడంతో ఇప్పటికే పలువురు వైకాపా నేతలను పోలీసులు విచారించారు. ఈ కేసులో సజ్జల ప్రమేయం ఉందని గుర్తించిన పోలీసులు ఆయన విదేశాలకు వెళ్లకుండా ఇప్పటికే లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. పార్టీ కార్యాలయంపై దాడి కేసులో వైకాపా నేతలు లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాశ్, తలశిల రఘురామ్‌లను ఇప్పటికే ఫలు దఫాలుగా పీఎస్‌కు పిలిపించి విచారించారు. కేసు కొలిక్కి వస్తున్న నేపథ్యంలో దాడి ఘటనలో ప్రమేయం ఉన్న ముఖ్య నాయకులను విచారించేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా సజ్జలను విచారిస్తున్నారు.

# ఏపీలో పెట్టుబడులకు ఇంతకంటే మంచి సమయం లేదు: సీఎం చంద్రబాబు



చండీగఢ్: పెట్టుబడిదారులకు ఏపీ స్వర్గధామం అని ఏపీ సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. హరియాణా సీఎం నాయబ్ సింగ్ సైనీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రెడ్ కార్పెట్ ఆహ్వానమంటూ స్వాగతించారు. ఏపీ ఇప్పుడు కొత్త అత్యుత్తమ విధానాలతో ఆహ్వానం పలుకుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ పూర్తిగా వ్యాపార అనుకూల రాష్ట్రమని చెప్పారు. కొత్త పాలసీ ఫ్రేమ్‌వర్క్‌ను పరిశ్రమ అనుభవజ్ఞులతో రూపొందించామన్నారు. "వ్యవస్థాపక స్ఫూర్తి, వ్యాపారాలను పెంపొందించడమే లక్ష్యం. దేశంలో అత్యుత్తమ వ్యాపార పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తున్నాం. అభివృద్ధికి ఏపీ రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యతను తీసుకుంటుంది. దేశంలో, ఏపీలో పెట్టుబడులకు ఇంతకంటే మంచి సమయం లేదు. ఈ ఉత్తేజకరమైన వృద్ధి ప్రయాణంలో మాతో సహకరించండి. వ్యాపార పరిధులు, రాష్ట్ర సామర్థ్యం పరస్పరం విస్తరించుకునే అవకాశమిది. ఏపీలో నూతన పెట్టుబడుల కోసం ఎదురుచూస్తున్నాం" అని చంద్రబాబు తెలిపారు.

# సీఎంను పొగుడుకుంటూనే షాకింగ్ కామెంట్స్ చేసిన షర్మిల..



అమరావతి, అక్టోబర్ 17: ఏపీలో కూటమి ప్రభుత్వంపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల ముందు పథకాల పేరుతో మభ్యపెట్టి.. అధికారం చేపట్టాక ఆ హామీలను అమలు చేయడం లేదన్నారు. గురువారం విజయవాడలో మీడియాతో మాట్లాడిన వైఎస్ షర్మిల.. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**వైఎస్ షర్మిల కామెంట్స్ యధావిధిగా..** 'నిన్నటి క్యాబినెట్ మీటింగ్‌లో సూపర్ సిక్స్‌లో ఒక్క సిక్స్ గురించి అయినా చర్చిస్తారు. ఒక్కటైనా అమలు చేస్తారని అనుకున్నాం. మహిళలకు శుభవార్త చెప్తారని అనుకున్నాం. ఉచిత సిలిండర్లు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఈ రెండూ లో బడ్జెట్ స్కీమ్‌లు. వీటిని అమలు చేస్తారని భావించాం. కానీ, ఎక్కడా వాటిని ప్రస్తావించలేదు. బాబు సూపర్ సిక్స్‌లు గాలికి కొట్టుకుపోయాయి. కొత్తగా సిక్స్ పాలసీలు వచ్చాయి. కొత్త పరిశ్రమలు వస్తే మంచిదే. పెట్టుబడులు రావాలి. ఉద్యోగాలు రావాలి. రూ. 30 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువస్తామన్నారు. 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. జాబ్ ఫస్ట్ అనేది తమ నినాదం అని సీఎం చంద్రబాబు చెప్పారు.' అని షర్మిల గుర్తు చేశారు.

**సందేహం వ్యక్తం చేసిన షర్మిల..** 'మాటలన్నీ బాగానే చెప్పారు. కానీ, ఇక్కడే బిలియన్ డాలర్ల ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇవన్నీ అమలు చేసే చిత్తశుద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉందా? 2014లో పెద్ద పెద్ద పథకాలు అన్నారు. అమరావతిని సింగపూర్ అన్నారు. 3%ణ% గ్రాఫిక్స్ చూపించారు. అప్పుడు చెప్పిన వాటికి, ఇప్పుడు చెప్పిన వాటికి తేడా లేదు. పాత సినిమాకి కొత్త టైటిల్ పెట్టారు. చంద్రబాబు చెప్తుంటే ఈ కథ ఎక్కడో విన్నట్లుంది అనిపించింది. పాత గిఫ్ట్ కొత్త బాక్స్‌లో ఇస్తున్నారు. ఇవి అమలు అవుతాయా లేదా అనే అనుమానాలు ఉన్నాయి.' అని సందేహం వ్యక్తం చేశారామె.


**ఆ నినాదం మంచిదే..** 'సీఎం చంద్రబాబును ఒక విషయంలో స్వాగతిస్తున్నాం. జాబ్ ఫస్ట్ అనే నినాదం మంచిదే. రాష్ట్రంలో నిరుద్యోగం తారా స్థాయిలో ఉంది. ఉద్యోగాలు లేక వలసలు పోతున్నారు. గత 10 ఏళ్లుగా పరిశ్రమలు లేక యువత వలసలు వెళ్ళింది. రాష్ట్రానికి నిరుద్యోగం అతి పెద్ద సమస్య. నిన్న చంద్రబాబు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులు 50 లక్షల మంది ఉన్నారు. ఈ లెక్కన బాబు చెప్పినట్లు ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు ఇస్తే..5 ఏళ్లలో 20 లక్షలు ఇస్తారు. ఏడాదికి 4 లక్షల ఉద్యోగాల కల్పన జరిగితే మిగతా వాళ్ల సంగతి ఏంటి..? ఉద్యోగాలు అని గతంలో మోడీ బీజేపీ ప్రభుత్వం కూడా మోసం చేసింది. 20 కోట్ల ఉద్యోగాలలో మనకు ఎన్ని వచ్చాయి ? ఒక్క ఉద్యోగం ఇవ్వని మోడీకి ఎందుకు చంద్రబాబుకు మద్దతు ఇస్తున్నారు ? రాష్ట్రంలో మీరు ఇచ్చే 20 లక్షలకు తోడు మరో 30 లక్షల ఉద్యోగాలు మోడీ ఇవ్వాలి. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం చంద్రబాబు డిమాండ్ చేయాలి. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఇద్దరు కలిసి కూర్చొని ఉద్యోగాల కల్పన పై వైట్ పేపర్ రిలీజ్ చేయాలి.' అని షర్మిల డిమాండ్ చేశారు.





# మోహిని అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న చిన వెంకన్న

పశ్చిమగోదావరి జిల్లా: ఏలూరులోని ప్రముఖ పుణ్య క్షేత్రం ద్వారకా తిరుమల... చిన తిరుపతిలో ఆశ్వయుజ మాస బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. 5 వ రోజు గురువారం చిన వెంకన్న మోహిని అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఉదయం సింహ వాహనంపై స్వామివారి ఊరేగింపు జరగనుంది. అలాగే రాత్రి 8 గంటలకు స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవం జరిగింది. అనంతరం వెండి గరుడవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. కాగా ద్వారకా తిరుమలలో ఏడాదిలో రెండు సార్లు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఒకసారి వైశాఖమాసంలో, మరోసారి అశ్వయుజ మాసంలో స్వామివారికి వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుపుతారు. ఈ బ్రహ్మోత్సవాలను ఎనిమిది రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు. 18న (శుక్రవారం) ద్వారకా తిరుమలలోని మాఢ వీధుల్లో స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. అశ్వయుజ మాస బ్రహ్మోత్సవాలు జరిగే 8 రోజులపాటు వివిధ వాహనాలపై స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనం ఇస్తారు. ఈ ఎనిమిది రోజులపాటు ద్వారకా తిరుమలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి.. చిన వెంకన్నను దర్శించుకుంటారు. కాగా బ్రహ్మోత్సవాల సందర్భంగా.. నిత్యార్జిత కళ్యాణాలు, సేవలను ఆలయ అధికారులు రద్దు చేశారు. ఉత్సవాల కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ప్రధాన ఆలయంతో పాటు.. నాలుగు రాజగోపురాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజు సాయంత్రం శ్రీహరి కళాతోరణంలో భక్తుల కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. భద్రత పరంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అన్నిరకాల చర్యలు చేపట్టారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. కాగా18వ తేదీ రాత్రి ఏడు గంటలకు స్వామివారికి రథోత్సవం నిర్వహిస్తారు. శనివారం (19వ తేదీ) ఉదయం ఏడు గంటలకు చక్రస్నానం, రాత్రి ఏడు గంటలకు శ్రీవారి ధ్వజావరోహణ కార్యక్రమాలు జరుగుతాయి. సోమవారం (20వ తేదీ) ఉదయం తొమ్మిది గంటలకు చూర్ణోత్సవం, వసంతోత్సవం జరుగుతుంది. రాత్రి ఏడు గంటలకు ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, పవళింపు సేవ, శ్రీపుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి.



# నటి జెత్వానీ కేసు.. వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ రిమాండ్ పొడిగింపు

విజయవాడ: ముంబయి నటి కాదంబరీ జెత్వానీ కేసులో నిందితుడు, వైకాపా నేత కుక్కల విద్యాసాగర్ రిమాండ్ పొడిగించారు. విజయవాడ నాలుగో ఏసీఎంఎం కోర్టు ఈ నెల 29 వరకు రిమాండ్‌ను పొడిగించింది. ఈ కేసులో ఆయన ఏ1గా చేర్చారు. ప్రస్తుతం విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

# వెయ్యి కలశములతో రాఘవేంద్ర స్వామికి క్షీరాభిషేకం



మంత్రాలయం: మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి తమిళనాడు భక్తులు దాదాపు 1500 మంది చేరుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పీఠాధిపతి సుబుదేంద్ర చేతుల మీదుగా దాదాపు వెయ్యి రాగి కలశములతో క్షీరాభిషేకం నిర్వహించారు.

అనంతరం ఊంజల మంటపంలో ఉత్సవమూర్తి ప్రహ్లాద రాయలకు విశేష పూజలు నిర్వహించారు.

**మంత్రాలయంలో భక్తుల సందడి :** మంత్రాలయంలో భక్తుల సందడిరాఘవేంద్ర స్వామి దర్శనార్థం దేశం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు మంత్రాలయం చేరుకున్నారు. గురువారం రాఘవేంద్ర స్వామికి అత్యంత ఇష్టమైన వారం కావడంతో కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర, కేరళ తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు మంత్రాలయం చేరుకున్నారు. తుంగభద్ర నదిలో పవిత్ర స్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు భక్తులకు ఫలమంత్ర అక్షింతలు ఇచ్చి ఆశీర్వదించారు.వేలాది మంది భక్తులతో మంత్రాలయం ప్రధానవీధులు, మధ్వ కారిడార్ తుంగభద్ర నది తీరం శ్రీమఠం ప్రకారంలో భక్తులతో కిటకిటలాడింది.

# ఎంజీఆర్ నాకెప్పుడూ స్ఫూర్తి: పవన్ కల్యాణ్



అమరావతి: అన్నాడీఎంకే పార్టీకి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఎంజీ రామచంద్రన్ (ఎంజీఆర్) ఈ పార్టీని స్థాపించి తమిళనాడులో తిరుగులేని రాజకీయశక్తిగా ఎదిగారన్నారు. పేదలు, అన్నార్థులకు సాయం చేశారని.. వారికి హుందాగా జీవించే హక్కును కల్పించారని కొనియాడారు. ఆయన పాలనలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమానంగా చేపట్టారని.. తమిళనాడును దేశంలో సుసంపన్న రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. "ప్రజల వర్తమాన అవసరాలను తీర్చడంతో పాటు దీర్ఘకాలిక భవిష్యత్తు, స్థిరాభివృద్ధికోసం ఎంజీఆర్ గొప్ప పునాది వేశారు. ప్రజలు, పాలన పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధిని చూసి నేను స్ఫూర్తి పొందా. ఎంజీఆర్ తర్వాత ఆయన ఆశయాలు, నాయకత్వాన్ని జయలలిత విజయవంతంగా కొనసాగించారు. ఎంజీఆర్ ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లి ప్రజల చేత 'అమ్మ'గా గౌరవాన్ని అందుకున్నారు. పళనిస్వామి నేతృత్వంలో అన్నాడీఎంకే.. ఎంజీఆర్ విలువల్ని ముందుకు తీసుకెళ్లాలి. ఎన్నో సవాళ్లు ఎదురైనా ఆ పార్టీ తమిళనాడు ప్రజల గొంతుకగా ఉంది. ఇదంతా ఆ పార్టీ విలువల వల్లే సాధ్యమైంది" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## వెజ్-నాన్ వెజ్ కలిపి కుమ్మేస్తోన్న బుట్టబొమ్మ!


ముంబై బ్యూటీ పూజాహెగ్డే వెకేషన్ లో ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే అమ్మడు వెకేషన్ ఫోటోలు నెట్టింట షేర్ చేసింది. సోలోగా జంగిల్ రిసార్ట్స్ లో ఎంజాయ్ చేస్తోంది. అక్కడ ప్రతీమూవ్ మెంట్ ని అభిమానులతో పంచుకుంటుంది. తాజాగా అమ్మడు మరో పిక్ రిలీజ్ చేసింది. ఇందులో సొగసరి కడుపు నింపే కార్యక్రమంపై దృష్టి పెట్టింది. వెజ్-నాన్ వెజ్ అన్నిరకాల వంటకాల్ని కలిపి కుమ్మేస్తోంది. ఎదురుగా ఇష్టమైన వంటకాలన్నింటిని ముందుపెట్టుకుని ఆరగిస్తుంది. పెద్ద డైనింగ్ టేబుల్ పై ఆహార పదార్ధాలను ఇక్కడ చూడొచ్చు. వైట్ రైస్...పాపడ్, పీతల కర్రీ, రోటీ, వివిధ రకాల



ఫ్రైలు అన్నింటిలోనూ కరివేపాకు దట్టించి మరీ ప్రిపేర్ చేయించుకుంది. అన్నింటిని రుచి వరకూ పరిమితం చేసింది. పూజాహెగ్డే ఇంతవరకూ ఎప్పుడూ ఇలా కనిపించలేదు. తొలిసారి ఓ పెద్ద ప్లేటులో భుజించడం ఇదే తొలిసారి కావచ్చు. ఇలా ఇన్నిరకాల వంటకాలు రుచి చూసే అమ్మడైతే? ప్రభాస్ ఇంట వంటకాలు కూడా రుచి చూసే ఉండాలి కదా. ఇద్దరు కలిసి రాధేశ్యామ్ లో నటించిన సంగతి తెలిసిందే. ప్రభాస్ సినిమాలో నటించిన హీరోయిన్లకు తన ఇంటి భోజనం ఇవ్వడం..ఆయనకు నచ్చిన అన్ని రకాల నాన్ వెజ్ వంటకాలు వండి ఇవ్వడం ఓ అలవాటు. ఇప్పటి వరకూ తనతో పనిచేసిన హీరోయిన్లు అందరికీ తన రుచులు చూపించాడు. మరి అందులో పూజాహెగ్డే ఉందా? లేదా? తెలియాలి. ప్రభాస్ రుచులు చూసిన వారంతా ప్రచార సమయంలో రివీల్ చేసారు. కానీ పూజాహెగ్డే మాత్రం ఎక్కడా ఈ సంగతి చెప్పలేదు.

## హీరోయిన్లను 'ఏఐ' ఇలా కూడా ముంచుతుందా!

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని వాడుకున్న వాడుకున్నంత కంపర్టుబుల్ గా మారిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఏఐతో సినిమా ఇండస్ట్రీలో ఎన్నో అద్భుతాలు చేస్తున్నారు. లేని నటుల్ని ఉన్నట్లు సృష్టించి అంతే నేచురాలిటీని తీసుకొస్తున్నారు. మ్యూజిక్ పరంగానూ ఈ టెక్నాలజీ ఎంతో వాడుకలోకి వచ్చేసింది. ఇదే టెక్నాలజీతో హీరోయిన్ల డీప్ పేక్ వీడియోలు అంతే సంచలనం రేపుతున్నాయి. ఎప్పుడు ఏ నటి పై ఎవరు ఎలా విరుచుకు పడతారో? తెలియని పరిస్థితి. దీంతో అందమైన హీరోయిన్లు అందరికీ అదో రకమైన టెన్షన్. బయటకు వస్తే వీలైనంత వరకూ ఎవరూ కనిపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తోంది. స్వేచ్ఛని



కోల్పోతున్నారు. అయినా ఏదో రకంగా వీడియోలు బయటకు వస్తూనే ఉన్నాయి. తాజాగా 'యానిమల్' బ్యూటీ త్రిప్తి డిమ్రీ వీడియో ఒకటి లీకైంది. అయితే ఇది అందరూ అనుకుంటోన్న వీడియో కాదు. మిమిక్రీ కి సంబంధించిన వీడియో. డిమ్రీ వాయిస్ ని కియారా అద్వాణీ..పరిణీతి చోప్రా.కృతి సనన్ గొంతులుగా మార్చి ఓ వీడియో వదిలారు. దీంతో ఫేస్ ఒకరిది..ముఖం ఒకరిదిగా మారింది. నిజంగా త్రిప్తి వాయిస్ తెలియకతే భంగపడటం ఖాయం.

ఆమె ఇలా మాట్లాడిందా? అనుకుంటారు. తప్పుడు పనులకు వాడనంత కాలం పర్వాలేదు. అలా జరిగితేనే పెను ముప్పు ఉంటుంది. దీంతో నెటి జనులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏఐతో భవిష్యత్ లో చాలా పెద్ద ప్రమాదమే హీరోయిన్లు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. మార్ఫింగ్ వీడియోలకు పాల్పడిన వారిని కూడా పట్టుకోవడం సైబర్ సిబ్బంది రాను రాను కష్టంగానూ మారుతుందంటున్నారు.




## గ్యాప్ దొరికినప్పుడల్లా కుమ్మేస్తున్నావ్ 'దేవర'



జూనియర్ ఎన్టీఆర్ కెరీర్ లో మరో ఘన విజయంగా నిలిచిన చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా మొదట కొంత నెగిటివ్ హైప్ తోనే విడుదలైంది. విడుదల కాగానే ఒక రేంజ్ లో నెగిటివ్ రివ్యూలు కూడా వచ్చాయి. కానీ వాటన్నింటినీ దాటుకుంటూ సినిమా భారీ వసూళ్లు సాదించింది. టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద మంచి సక్సెస్ అందుకుంది. ఇక గ్యాప్ దొరికినప్పుడల్లా కుమ్మేస్తోంది. ఇప్పటివరకు ఇండియాలో ఈ సినిమా రెండు వారాల్లో దాదాపు రూ. 295 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. ఈ సక్సెస్ వెనుక అదృష్టం కూడా ఉందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. టాలీవుడ్ లో ఎలాంటి పోటీ లేదు. దసరా సెలవులు కూడా చక్కగా హెల్ప్ అయ్యాయి. మొన్నటి వీకెండ్ సినిమాలు కూడా దేవర ముందు నిలబడలేకపోయాయి. ముఖ్యంగా నార్త్ లో దేవర లక్కు మామూలుగా లేదు. ఇటీవల విడుదలైన హిందీ సినిమాలు 'జిగ్రా' మరియు 'విక్కీ విద్యా కా వో వాలా వీడియో' అనుకున్నంత పాజిటివ్ టాక్ అందుకోలేదు. దీంతో హిందీ రాష్ట్రాల్లో 'దేవర'కు మంచి ఫలితం దక్కినట్లు తెలుస్తోంది. అసలు 'జిగ్రా' చిత్రంకు ఎంత ప్రమోషన్ చేసినా, ప్రేక్షకులను ఆ మూవీ ఆకట్టుకోలేకపోయింది. దానికి తోడు, 'విక్కీ విద్యా కా వో వాలా వీడియో' సినిమా కూడా నెగటివ్ రివ్యూలు అందుకోవడంతో, ఆ సినిమాలకు డిమాండ్ లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో హిందీ మార్కెట్ లో 'దేవర' కోసం ఒక మంచి అవకాశం ఏర్పడింది. నార్త్ జనాలు దేవర చూసేందుకు ఎగబడడంతో సినిమాకు హిందీ రాష్ట్రాల్లో కూడా మంచి వసూళ్లు వచ్చాయి. దక్షిణాది రాష్ట్రాల విషయానికి వస్తే, 'దేవర' మొదటి నుంచే అంచనాలు మేరకు రాణించింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలో ఈ సినిమాకు భారీ వసూళ్లు వచ్చాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా ఇప్పటికే బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. కర్ణాటకలో కూడా మంచి వసూళ్లు రాబడుతుండగా, తమిళనాడు మరియు కేరళలో మాత్రం కలెక్షన్స్ కొంత బాగానే ఉన్నాయి. ఇక గ్లోబల్ లెవల్ లో ఈ సినిమా రూ. 400 కోట్ల క్లబ్ లో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయని అంటున్నారు. కానీ మేకర్స్ 500 కోట్ల పోస్టర్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇంటర్నేషనల్ మార్కెట్ లో 'దేవర' సినిమా మంచి వసూళు రాబడుతోంది. హిందీ రాష్ట్రాల్లో 'దేవర'కి మంచి క్రేజ్ రావడం, అక్కడి స్థానిక సినిమాలు వర్కౌట్ అవ్వకపోవడం వల్లే ఈ సినిమా మరింత ముందుకు వెళ్ళే అవకాశం ఉన్నట్లు ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మొత్తానికి, జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ భారీగా ఎదురుచూసిన 'దేవర' సినిమా విజయవంతం కావడం, రెండవ భాగం కోసం ఆసక్తి పెంచడం వంటి అంశాలు సినిమా సక్సెస్ లో కీలకపాత్ర పోషిస్తున్నాయి. 'దేవర' రెండో భాగం కూడా ఇలాగే బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తే, జూనియర్ ఎన్టీఆర్ కెరీర్ లోనే మరొక రికార్డ్ అందికునే అవకాశం ఉంటుంది.

## సురేఖ వాణి, సుప్రీతా గ్లామర్ షో.. క్యూట్ కాంబినేషన్




టాలీవుడ్ లో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా మంచి పేరు సంపాదించిన సురేఖ వాణి తన కూతురు సుప్రీతతో కలిసి మరోసారి సోషల్ మీడియాలో ఫోటోలను షేర్ చేసింది. తన క్యూట్ లుక్ తో అభిమానులను ఆకట్టుకునే సురేఖ వాణి, సుప్రీత ఇద్దరూ బ్రౌన్ కలర్ డ్రెస్సుల్లో స్టిల్ ఇస్తూ కనిపించారు. సురేఖ వాణి తెలివైన ఫ్యాషన్ సెన్స్ తో నెటిజన్లని ఆకట్టుకుంటూనే ఉంటుంది. అలాగే, ఆమె కూతురు సుప్రీత తన గ్లామర్ లుక్ తో తనదైన ఫ్యాన్ బేస్ ను ఏర్పరుచుకుంది. ఈ ఫోటోలో ఇద్దరూ చాలా స్టైలిష్ గా, కాంపాక్ట్ లుక్ లో కనిపించారు. సుప్రీతా సింపుల్ టాప్ మరియు షార్ట్ స్కర్ట్ లో ఉన్నా, ఆమె నవ్వు, గ్లామర్ లుక్‌తో కుర్రకారును ఆకట్టుకుంది. మరోవైపు సురేఖ వాణి మిడ్‌స్లైట్ గౌన్‌తో అందాలను మెరిపించింది. సురేఖ వాణి క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా ఉన్నా, ఫ్యాషన్ విషయంలో ఎప్పుడూ ట్రెండింగ్ లో ఉంటుంది. సురేఖ వాణి కూతురు సుప్రీతా కూడా సోషల్ మీడియాలో చాలా చురుకుగా ఉంటూ తరచుగా ట్రెండింగ్ ఫోటోలను షేర్ చేస్తోంది. ఈసారి తల్లి, కూతురు ఇద్దరూ కలిసి ఫోటోలకు పోజిచ్చారు. ప్రత్యేకంగా ఈ ఫోటోల్లో ఇద్దరూ బ్రౌన్ షేడ్స్‌లో ఉండటం గ్లామర్‌ని మరింత ఎక్కువగా చూపించేలా ఉంది. సురేఖ వాణి కూతురుతో ఉన్న ఈ క్యూట్ మోమెంట్స్ అభిమానుల హృదయాలను కొల్లగొడుతున్నాయి. ఇటీవలి కాలంలో సుప్రీతకు డెబ్యూ అవకాశం రావడంతో ఆమె టాలీవుడ్ లో తనదైన గుర్తింపును పొందేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

మోడర్న్ లుక్స్, ట్రెడిషనల్ లుక్స్ అన్నీ ప్రదర్శిస్తూ కుర్రాళ్ళ మతులు పోగొడుతోంది. ఆమె సోషల్ మీడియాలో తరచూ పోస్ట్ చేసే ఫోటోలు విపరీతంగా వైరల్ అవుతున్నాయి. మొత్తానికి, సురేఖ వాణి మరియు సుప్రీతా ఇద్దరూ తమ ప్రత్యేక శైలిలో ఉన్న ఈ ఫోటోలకు, నెటిజన్ల నుంచి మంచి స్పందన వస్తోంది.

## కృతి సనోన్ క్రేజీ మూవీ.. చివరికి ఓటీటీలోనే..

బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా తిరుగులేని ఇమేజ్ తో దూసుకుపోతున్న కృతి సనోన్ నిర్మాతగా మారి 'దోపత్తి' అనే సినిమా నిర్మించింది. ఈ సినిమాలో ఆమె ట్విన్ సిస్టర్స్ గా రెండు విభిన్న పాత్రలలో కనిపించబోతోంది. అలాగే ఒకప్పటి స్టార్ హీరోయిన్ కాజోల్ ఈ మూవీలో పవర్ ఫుల్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ గా నటించారు. ఆమె పాత్ర కూడా చాలా ఇంటెన్సివ్ గా ఉంటుందనే మాట వినిపిస్తోంది. శశాంక్ చతుర్వేది ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.




బుల్లితెర సీరియల్ యాక్టర్ షహీర్ షేక్ ఈ చిత్రంతో బిగ్ స్క్రీన్ పైకి అడుగుపెడుతున్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమా అక్టోబర్ 25న డైరెక్ట్ గా ఓటీటీలో రిలీజ్ కాబోతోంది. నెట్ ఫ్లిక్స్ లో 'దోపత్తి' సినిమాని ప్రేక్షకుల ముందుకి తీసుకొని రాబోతున్నారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్ ని రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్ కి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. మూవీలో కృతి సనోన్ ఒక క్యారెక్టర్ లో నెగిటివ్ షేడ్స్ లో కనిపిస్తోంది. కనిపించకుండా పోయిన గీత తన సిస్టర్ సీత లైఫ్ లోకి మరల వస్తుంది. ఆమె బాయ్ ఫ్రెండ్ ని ఫ్లట్ చేస్తూ ఇద్దరి జీవితాన్ని డిస్టర్బ్ చేసే ప్రయత్నం చేస్తుంది. ఈ క్రమంలో వారి ముగ్గురు జీవితాలలో జరిగిన సంఘటనల ఇతివృత్తంగా 'దోపత్తి' కథాంశం ఉండబోతోందని ట్రైలర్ బట్టి అర్ధమవుతోంది. ఈ కేసుని ఇన్వెస్టిగేషన్ చేసే పోలీస్ ఆఫీసర్ గా కాజోల్ కనిపిస్తోంది. ట్రైలర్ చూసిన తర్వాత కాజోల్ ని ఫ్యాన్స్ లేడీ సింగం అంటూ కామెంట్ చేస్తున్నారు. అజయ్ దేవగన్ బాజీరావ్ సింగం పాత్రలో ఇప్పటికే బాలీవుడ్ లో తన మార్క్ క్రియేట్ చేసాడు. ఈ నేపథ్యంలోనే కాజోల్ ని లేడీ సింగం అంటూ ప్రశంసిస్తున్నారు. సస్పెన్స్ థ్రిల్లర్ గా రాబోతున్న ఈ సినిమాపై కృతి సనన్ చాలా కాన్ఫిడెంట్ గా ఉంది.

ఓటీటీలో ఇలాంటి చిత్రాలకి మంచి ఆదరణ లభిస్తూ ఉంటుంది. తాప్సి నటించిన 'హసీనా దిల్ రూబా' ఇలాంటి జోనర్ లోనే వచ్చి సూపర్ హిట్ అయ్యింది. దానికి సీక్వెల్ గా వచ్చిన మూవీ కూడా హిట్ అయ్యింది. ఆ సినిమాకి కథ అందించిన కనికా థిల్లాన్ 'దోపత్తి' సినిమాకి కూడా స్టోరీ రాయడం విశేషం. హిందీలో మోస్ట్ ప్రామిసింగ్ థ్రిల్లర్ మూవీగా రాబోతున్న ఈ సినిమా ఓటీటీ ఆడియన్స్ ని ఏ మేరకు ఎట్రాక్ట్ చేస్తుందనేది వేచి చూడాలి.

## నిధి అగర్వాల్.. ఒకేరోజు రెండు పెద్ద సినిమాలతో ఇలా..

యంగ్ హీరోయిన్ నిధి అగర్వాల్ ప్రస్తుతం తన డెడికేషన్ తో అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఒకే రోజు రెండు బిగ్ బడ్జెట్ చిత్రాల్లో నటించడం అంటే ఈ రోజుల్లో అంత సాధారణమైన విషయం కాదు. అయితే నిధి అగర్వాల్ ఈ టాస్క్‌ను ఎంతో సాఫీగా పూర్తి చేయగలిగింది. ఆమె అందుకు ఎంతో ఇష్టపూర్వకంగా హాజరై ప్రొఫెషనల్ మైండ్‌సెట్‌తో వ్యవహరించిందని తెరపై కనిపిస్తోంది. హీరోయిన్‌గా ఎప్పుడూ కొత్తదనంతో కనిపించాల్సిన బాధ్యత నిధిపై ఉంది. ముఖ్యంగా పెద్ద చిత్రాల్లో నటిస్తే, ఎలాంటి ఆటంకం లేకుండా షూటింగ్ టైమ్ ను కాపాడుతూ సహా నటీనటులు, దర్శక నిర్మాతల సమయాన్ని వృథా కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుంది. ఈ క్రమంలో నిధి అగర్వాల్ తన ప్రొఫెషనలిజాన్ని మరోసారి నిరూపించింది. ప్రస్తుతం నిధి అగర్వాల్ పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న "హరి హర వీర మల్లు" సినిమాలో ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఈ సినిమాలో ఆమె ఒక పీరియాడికల్ ప్రిన్సెస్ పాత్రలో కనిపించనుంది. అంతేకాకుండా యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న "ది రాజా సాబ్" సినిమాలో ఒక కీలక పాత్రలో నటిస్తోంది. ఈ రెండు సినిమాలు భారీ బడ్జెట్‌తో రూపొందుతున్నాయి. అయితే, ఈ రెండు చిత్రాల్లో భాగం అవుతూ ఒకే రోజు రెండు సిటీల మధ్య



ప్రయాణించడం ఆమెకు ఓ ఛాలెంజ్‌గా మారింది. ఒకే రోజులో విజయవాడలో "హరి హర వీర మల్లు" షూట్‌లో పాల్గొని, ఆ వెంటనే హైదరాబాద్‌కు ప్రయాణించి "ది రాజా సాబ్" షూటింగ్‌కు హాజరవ్వాల్సి వచ్చింది. అంతే కాకుండా ఈ రెండు పాత్రల మధ్య వ్యత్యాసం కూడా ఉంది. "హరి హర వీర మల్లు"లో ఆమె ఒక పీరియాడికల్ లుక్‌లో ఉంటే, "ది రాజా సాబ్"లో ఒక స్టైలిష్ గ్లామరస్ గర్ల్ కనిపించనుంది. ఈ రెండు పాత్రల కోసం నిధికి లుక్, బాడీ లాంగ్వేజ్ లో మార్పులు వేగంగా తీసుకు రావాల్సి ఉంటుంది. ఇంత క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా నిధి అగర్వాల్ తన పనితీరుతో అందరి మన్ననలు పొందింది. రెండు పాత్రల కోసం ప్రొఫెషనల్‌గా, శ్రద్ధగా పనిచేయడం ఆమె ప్రత్యేకత. ఆమె డెడికేషన్‌ను మెచ్చుకుంటూ ఫిల్మ్ ఇండస్ట్రీలో పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇలాంటి సమయస్ఫూర్తితో పని చేయడం వల్లే ఆమె ప్రొఫెషనల్ కెరీర్‌లో ముందుకు దూసుకుపోతోందని అనిపిస్తోంది. ఇక ఈ రెండు సినిమాలపై అమ్మడు భారీ ఆశలు పెట్టుకుంది. బాక్సాఫీస్ వద్ద సినిమాలు సక్సెస్ అయితే ఆమెకు ఇండస్ట్రీలో మరిన్నీ అవకాశాలు పెరిగే ఛాన్స్ ఉంటుంది.



# తెలంగాణ కేబినెట్ భేటీకి ముహూర్తం ఖరారు..!

తెలంగాణ మంత్రి మండలి సమావేశానికి తేదీ ఖరారైంది. ఈనెల 23వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం వేదికగా సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సాయంత్రం 4 గంటలకు కేబినెట్ భేటీ జరుగనుంది. హైడ్రాకు చట్టబద్ధత, అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై ఈ కేబినెట్ భేటీలో చర్చించనున్నారు. ఇదిలా ఉండగా.. హైడ్రా కు ఫుల్ పవర్స్ వచ్చాయి. హైడ్రా చట్టబద్ధతపై ప్రశ్నించేవారికి ఆర్డినెన్స్ తో చెక్ పెట్టారు. జీహెచ్ఎంసీ చట్టం 1955లో 374 బీ సెక్షన్ చేరుస్తూ ఆర్డినెన్స్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఆర్డినెన్స్ కొనసాగింపుగా జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం హైడ్రాకు అధికారాలను బదాలయిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిషోర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఓఆర్ఆర్, హైడ్రా పరిధిలో మున్సిపల్ చట్టం ప్రకారం ప్రభుత్వం అధికారాలను బదాలయించింది. దీంతో ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, నాలాలు, రోడ్లు, పార్కులు, జీహెచ్ఎంసీ, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులను పరిరక్షించడానికి హైడ్రాకు పూర్తి అధికారాలు వచ్చాయి. ఫలితంగా ఇక నుంచి నోటీసులు జారీ చేయడం, మౌఖిక ఆదేశాలు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన భవనాలను కూల్చేయడానికి, సీజ్ చేయడానికి హైడ్రాకు పూర్తి అధికారాలు వచ్చాయని కమిషనర్ రంగనాథ్ తెలిపారు.




# హైడ్రాకు సర్వాధికారాలు.. - రాష్ట్ర పురపాలక శాఖ ఉత్తర్వులు

హైదరాబాద్: ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ బాధ్యతలను పూర్తిస్థాయిలో హైడ్రాకు అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అధికారులు హైడ్రా డైరెక్షన్ లోనే నోటీసులు జారీ చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం జీవో 199 విడుదల చేసింది. గ్రేటర్ పరిధిలోని అక్రమ కట్టడాలన్నీ కూల్చివేసే పవర్ హైడ్రాకు ఇచ్చింది. జీహెచ్ఎంసీ చట్టంలో పలుమార్పులు చేసింది. జీహెచ్ఎంసీ చట్టంలో మున్సిపల్ శాఖ. 374B ప్రత్యేక సెక్షన్ చేర్చింది.

దీంతో బల్దియాతో పాటు 27 మున్సిపాలిటీలు, 33 గ్రామాల పరిధిలో హైడ్రా దూకుడు పెంచనుంది.. ఇక నుంచి జీహెచ్ఎంసీ పరిధిలో ప్రభుత్వ ఆస్తులను పరిరక్షిస్తారు. అక్రమ కట్టడాలకు నోటిసులు జారీ నుంచి కూల్చివేతల వరకు అన్నీ హైడ్రా చేయనుంది.

**హైడ్రాకు జీహెచ్ఎంసీ, మునిసిపల్ అధికారాల బదిలీ :** జీహెచ్ఎంసీ పరిధిలోని పలు అధికారాలను హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా)కు బదలాయిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ ఉత్తర్వులు (జీవో-191) జారీ చేసింది. జీహెచ్ఎంసీ-1955 చట్టంలోని సెక్షన్ 374-బీ ప్రకారం చెరువులు, పార్కులు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, రోడ్లు, డ్రైన్‌ల పరిరక్షించాల్సి ఉంటుంది. ఈ అధికారాలను హైడ్రాకు బదిలీ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. మంత్రివర్గ ఆమోదంతో ఆర్డినెన్సు ప్రతిపాదనలను గవర్నర్‌కు పంపింది. దీనిని ఆమోదిస్తూ ఈ నెల 3వ తేదీన గవర్నర్.. గెజిట్ విడుదల చేశారు. ఈ మేరకు తాజాగా పురపాలక శాఖ జీవో 191ను జారీ చేసింది. ఆర్డినెన్స్, జీవో జారీతో హైడ్రా చర్యలకు సంబంధించి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని అధికార వర్గాలు చెబుతున్నాయి. తాజా అధికారాలతో ఆక్రమణలకు సంబంధించి హైడ్రా నోటీసులు జారీ చేయనుంది. ఆయా నిర్మాణదారులు సంబంధిత అనుమతి పత్రాలు, అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించని పక్షంలో స్పీకింగ్ ఆర్డర్స్ జారీ చేస్తుంది. వారు ఇచ్చే వివరణ అప్పటికీ సహేతుకంగా లేకుంటే నిర్మాణం కూల్చివేత/సీజ్ చేసే అధికారం హైడ్రాకు ఉంటుంది. చెరువులు, పార్కుల్లో అక్రమ నిర్మాణాలపై ఆదిలో ఉక్కుపాదం మోపిన హైడ్రా... హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కొంత కాలంగా ఆచితూచి వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టడంతోపాటు చెరువుల వాస్తవ విస్తీర్ణం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్ధారణపై దృష్టి సారించింది. ఇందుకోసం సర్వే ఆఫ్ ఇండియా, ఎన్ఆర్ఎస్‌సీ సాంకేతిక సహకారం తీసుకుంటోంది.

**కూల్చివేతలకు న్యాయపరమైన ఇబ్బందులు తొలగినట్లే :** జీవో జారీ నేపథ్యంలో ఇక నుంచి చట్టపరంగా ముందుకు వెళ్లాలని సంస్థ భావిస్తోంది. వాస్తవానికి రోడ్లు, పార్కులు, చెరువుల్లో ఆక్రమణలను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేసే అధికారాలు జీహెచ్ఎంసీతోపాటు మునిసిపాలిటీలకు ఉన్నాయి. కానీ, కూల్చివేతలపై హైకోర్టు అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో నోటీసుల జారీ, స్పీకింగ్ ఆర్డర్స్ తర్వాతే హైడ్రా నిర్ణయం తీసుకోనుంది. ఔటర్‌రింగ్ రోడ్డు వరకు హైడ్రా పరిధి ఉన్న నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ వరకు జీహెచ్ఎంసీ యాక్ట్ ప్రకారం, ఆవలి ప్రాంతాల్లోని 27 మునిసిపాలిటీలు/కార్పొరేషన్ల పరిధిలో మునిసిపల్ చట్టం ప్రకారం ముందుకు సాగనున్నట్టు కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. తాజా జీవోతో హైడ్రా మరింత బలపడిందని, పూర్తి స్థాయిలో అధికారాలు వచ్చాయన్నారు. అనధికార భవనాలను కూల్చివేయడంతోపాటు ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వారికీ హైడ్రానే నోటీసులు జారీ చేస్తుందని తెలిపారు.

# రేవంత్ లోపభూయిష్ట విధానాలతో విద్యార్థులకు ఇబ్బందులు: కేటీఆర్...

హైదరాబాద్: సీఎం రేవంత్ లోపభూయిష్ట విధానాలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. పరీక్షలు రాస్తామో, రాయలేమోనన్న బాధలో వారున్నారని చెప్పారు. తెలంగాణ భవన్‌లో భారాస విద్యార్థి విభాగం ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ ప్రభుత్వ విధానాలతో రైతులు, యువకులతో పాటు అందరూ ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. నవంబర్ 5న ధర్నా చేస్తున్నామని ఆటో డ్రైవరు చెప్పారన్నారు. కష్టపడి కట్టుకున్న ఇళ్లను కూల్చివేస్తున్నారని కొంతమంది వచ్చి ఫిర్యాదు చేశారని కేటీఆర్ తెలిపారు.



# గుజరాత్‌కు ఒక నీతి, తెలంగాణకు ఒక నీతా?: హరీశ్‌రావు



హైదరాబాద్: తెలంగాణ రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పత్తికి కేంద్రం చెల్లించే మద్దతు ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కోవిధంగా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. "ఒకే దేశం- ఒకే పన్ను, ఒకే దేశం- ఒకే ఎన్నిక, ఒకే దేశం- ఒకే రేషన్" అంటూ ఊదరగొట్టే కేంద్ర ప్రభుత్వం.. ఒకే దేశం- ఒకే కనీస మద్దతు ధర ఎందుకు ఇవ్వడం లేదు. నాణ్యమైన పత్తిని పండిస్తున్న తెలంగాణ రైతు పట్ల ఎందుకీ వివక్ష? గుజరాత్ పత్తికి మద్దతు ధరగా క్వింటాకు రూ.8,257 చెల్లిస్తున్న కేంద్రం.. తెలంగాణకు రూ.7,521 మాత్రమే ఇవ్వడం దుర్మార్గం. గుజరాత్‌కు ఒక నీతి, తెలంగాణకు ఒక నీతా?" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# హైడ్రా బాధితులకు అండగా ఉంటాం..



హైదరాబాద్: హైడ్రా బాధితులకు అండగా నిలిచేందుకే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ భవన్‌లో నిర్వహించిన సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తోపాటు మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో మూసీ ప్రక్షాళనపై న్యాయపరంగా బాధితులకు అండగా నిలిచే అంశంపై నగర ఎమ్మెల్యేలతో కేటీఆర్ చర్చించారు. పార్టీ భవన్‌కు వచ్చిన హైడ్రా బాధితులకు తమ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి లోక్‌సభ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి కేటీఆర్‌కు పలు సూచనలు చేశారు.




# షేక్ హసీనాపై అరెస్టు వారెంట్.. నవంబర్ 18లోగా ఆమెను అరెస్టు చేయండి

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై అరెస్టు వారెంట్ జారీ అయింది. ఆ దేశానికి చెందిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఈ వారెంట్ ఇచ్చింది. నవంబరు 18లోగా ఆమెను అరెస్టు చేసి తమ ఎదుట హాజరు పరచాలని ఐసీటీ చీఫ్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ తజుల్ ఇస్లాం తన ఆదేశాల్లో పేర్కొన్నారు. రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారడంతో.. ప్రధానిగా ఉన్న షేక్‌హసీనా పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. తర్వాత నుంచి ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. జులై 15 నుంచి ఆగస్టు 5 వరకు జరిగిన మారణహోమం, ఇతర నేరాల ఆరోపణలపై హసీనాకు వ్యతిరేకంగా ఐసీటీకి 60 ఫిర్యాదులు అందాయి. వాటిపై ట్రైబ్యునల్ ఇటీవల దర్యాప్తు ప్రారంభించింది. భారత్‌లో ఆశ్రయం పొందుతున్న ఆమెను బంగ్లాదేశ్‌కు రప్పిస్తామని, ఆమెపై అరెస్టు వారెంట్లు జారీ చేస్తామని ఐసీటీ నూతన ప్రాసిక్యూటర్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఆమెను స్వదేశానికి రప్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ క్రమంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. హసీనా పాలనపై తీవ్ర నిరసన వ్యక్తంచేసిన విద్యార్థి సంఘాలు ఆమె భారత్‌లో ఉండటాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇదిలా ఉంటే.. హసీనాను చట్టబద్ధంగా తమ దేశానికి అప్పగించాలంటూ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) భారత ప్రభుత్వాన్ని డిమాండు చేసిన సంగతి తెలిసిందే. మరోపక్క ఆమె దౌత్య పాస్‌పోర్టు రద్దయిన సంగతి తెలిసిందే. హసీనా హయాంలో ఎంపీలకు జారీ చేసిన దౌత్య పాస్‌పోర్టులను రద్దు చేసినట్లు బంగ్లా హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ పాస్‌పోర్టు ఉన్నవారు కొన్ని నిర్దిష్ట దేశాలు వీసా లేకుండా ప్రయాణించే వీలు ఉంటుంది. ఆగస్టు 5న పదవి నుంచి దిగిపోయి భారత్‌కు చేరుకున్న తర్వాత బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. ఇదిలా ఉంటే.. హసీనాను బంగ్లాకు రప్పించడానికి యూనస్ ప్రభుత్వం అన్ని యత్నాలు చేస్తుందని ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ గతంలో పేర్కొంది. హసీనాను అప్పగించాలా, వద్దా అనే విషయంపై నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత భారత్‌పైనే ఉందని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.



# చెన్నైలో భారీ వర్షాలు.. ముందు జాగ్రత్తగా హోటళ్లకు వెళుతున్న ధనవంతులు

చెన్నై: చెన్నై నగరవ్యాప్తంగా అత్యంత భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజల్లో భయం పెరిగింది. ప్రత్యేకించి ఐటీ నిపుణులు, ధనవంతుల్లో చాలామంది విలాసవంతమైన హోటళ్లలో గదులు బుక్ చేసుకుని కుటుంబాలతో కలిసి దిగిపోతున్నారు. గతేడాది డిసెంబరులో ఒక్కసారిగా భారీ వర్షాలు కురవడంతో ఇళ్లలోకి వరద నీరు చేరి, కార్లు కొట్టుకుపోయిన నేపథ్యంలో ఈసారి అలాంటి పరిస్థితులు తలెత్తకుండా వారు హోటళ్లలో దిగుతున్నారు. కార్ల పార్కింగ్‌కు ప్రత్యేక వసతి, తాగునీరు, విద్యుత్ సరఫరాతోపాటు వైఫై ఉండేలా చూడాలన్న షరతులతో గదుల్లో దిగినట్లు సమాచారం. గురువారం భారీ నుంచి అతిభారీ వర్షసూచన చేశారు. బుధవారం రెడ్ ఎలర్ట్ ఇచ్చినా, సాయంత్రం వరకు తేలికపాటి జల్లులే పడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. బెంగళూరు(మల్లేశ్వరం), న్యూస్‌టుడే: భారీ వర్షాలకు బెంగళూరు నగరంలో జనజీవనం స్తంభించింది. చిక్కబళ్లాపుర, కోలారు, రామనగర, మైసూరు, చామరాజనగర, ఉడుపి, మంగళూరు, ఉత్తర కర్ణాటక, చిత్రదుర్గ తదితర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఐటీ, బీటీ కేంద్రాలకు నిలయమైన బెంగళూరులోని మాన్యత టెక్‌పార్కు ఆవరణలో నూతన నిర్మాణాల కోసం తీసిన పునాదుల్లో మట్టి పెళ్లలు విరిగిపడ్డాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షం నీరు ప్రవేశించింది. బెంగళూరు ఇందిరానగర్ సమీప మెట్రో మార్గంపై ఓ చెట్టు కూలడంతో కాసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

# వర్గీకరణ అంశంలో సీఎం ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదు: మందకృష్ణ మాదిగ




హైదరాబాద్: మరో ఉద్యమానికి మాదిగ, ఉపకులాలు సిద్ధంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలుచేసే విషయంలో రాష్ట్రం ముందుంటుందని సీఎం అన్నారని గుర్తుచేశారు. కానీ అమలు విషయంలో జాప్యం చేస్తున్నారని చెప్పారు.

"ఎస్సీ వర్గీకరణ అమలులో ఎందుకు జాప్యం చేస్తున్నారు? మాదిగలపై రేవంత్‌వి తేనె పూసిన మాటలు. నమ్మించడంలో ఘనుడు.. మోసం చేయడంలో అంతకన్నా పెద్ద ఘనుడే. వర్గీకరణ అంశంపై సీఎం తాను ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. ఎస్సీ వర్గీకరణ విషయంలో పంజాబ్, తమిళనాడు తొలి వరసలో నిలిచాయి. ముందు అమలుచేస్తామన్న రేవంత్ మాటలకు విలువ లేకుండాపోయింది" అని మందకృష్ణ మాదిగ విమర్శించారు.

# కొండా సురేఖ వ్యాఖ్యలపై మరోసారి స్పందించిన సమంత..

మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై సమంత మరోసారి స్పందించారు. తన వెబ్ సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ' ప్రమోషన్‌లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో దీని గురించి మాట్లాడారు. ఇటీవల చర్చనీయాంశమైన కొండా సురేఖ వ్యాఖ్యల గురించి రిపోర్టర్ అడగ్గా.. సమంత ఈవిధంగా స్పందించారు. 'ఈరోజు ఇక్కడ కూర్చోవడానికి ఎంతోమంది మద్దతు కారణం. ఇండస్ట్రీకి చెందిన ప్రముఖుల ప్రేమ, నాపై వారికి ఉన్న నమ్మకమే నన్ను ఈ స్థాయిలో నిలబెట్టింది. వారు నాలో ధైర్యం నింపారు. కష్టాలను ఎదుర్కోవడంలో వారి మద్దతు నాకెంతో సాయపడింది. వారు నా పక్షాన నిలవకపోతే కొన్ని పరిస్థితులను అధిగమించేందుకు చాలా సమయం పట్టేది. నా చుట్టూ ఉన్నవారి నమ్మకం వల్లే సమస్యలను ఎదుర్కోగలిగాను' అని అన్నారు. ఆన్‌లైన్ ట్రోలింగ్‌లపై సమంత స్పందిస్తూ.. అలాంటి వాటి గురించి ఎక్కువ ఆలోచించను అని అన్నారు. 'ద్వేషపూరిత సందేశాలను స్వీకరించినప్పుడు వాటి ప్రభావం నాపై పడకుండా చూసుకుంటాను. దాన్ని పంపిన వారు కూడా అలాంటి బాధనే అనుభవించారేమో అని ఆలోచిస్తాను' అని తెలిపారు.






# హైదరాబాద్‌లో పలుచోట్ల ఐటీ సోదాలు

హైదరాబాద్: నగరంలో పలుచోట్ల ఆదాయపన్నుశాఖ అధికారులు సోదాలు చేపట్టారు. అన్విత గ్రూపు కార్యాలయాల్లో తనిఖీలు చేస్తున్నారు. పలు దస్త్రాలను వారు పరిశీలిస్తున్నారు. సంస్థ డైరెక్టర్ల ఇళ్లలోనూ సోదాలు కొనసాగుతున్నాయి. జూబ్లీహిల్స్, రాయదుర్గం, కొల్లూరు, సంగారెడ్డిలో ఆదాయపన్నుశాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com